వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 50 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-





## దేశాభివృద్ధిలో ఇంజినీర్లది కీలకపాత్ర

- రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్స్ తమవంతు పాత్ర పోషించాలి
- ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపిన- సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ

తమ మేధోశక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజినీర్లదేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషి స్తున్న ఇంజినీర్లందరికీ ముఖ్యమంత్రి ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థికా భివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నారని -మిగతా 3 లో



## సుప్రీంకోర్టులో పెండింగ్‌కేసులు 88 వేలకు పైనే..

- 34 మంది జడ్జిలతో పూర్తి స్థాయిలో పని చేస్తున్నా గరిష్టస్థాయికి
- మరోవైపు కొత్త కేసుల వరద

న్యూఢిల్లీ

సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య 88,417 వేలకు పైగా చేరుకుంది. కోర్టు చరిత్రలో ఇది గరిష్టస్థాయి. ఒకవైపు సుప్రీంకోర్టు పూర్తి సామర్థ్యమైన 34 మంది జడ్జీలతో పని చేస్తున్నా పెండింగ్ కేసులు ఈ విధంగా పేరుకుపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జేడీజీ) సమాచారం ప్రకారం సుప్రీంకోర్టులో ఆగస్టు చివరి నాటికి 69,553 సివిల్ కేసులు, 18,864 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు కొత్త కేసులు దాఖలు చేయడం కూడా కొనసాగుతోంది. ఆగస్టు సమాచారం ప్రకారం ఈ నెలలో తీర్పు ఇచ్చిన కేసుల కంటే కొత్తగా వచ్చిన కేసుల సంఖ్య అధికంగా ఉంది. ఆగస్టులో 5,667 కేసులను పరిష్కరిం చగా, కొత్తగా 7,080 కేసులు విచారణ -మిగతా లో

# బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్..

### వ్యూహం మారింది.. గేరు మార్చింది..

### కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలను ఉక్కిరిబిక్కిరి

### పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలను వదిలిపెట్టేదే లేదంటోంది బీఆర్ఎస్

హైదరాబాద్- ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలను వదిలిపెట్టేదే లేదంటోంది బీఆర్ఎస్. అన్ని వైపుల నుంచి ఒత్తిడి తెచ్చి.. కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇప్పటివరకు అసెంబ్లీ వేదికగా కొట్లాడడం.. సుప్రీంకోర్టులో న్యాయం పోరాటం చేయడం ద్వారా ప్లాన్-A, ప్లాన్-Bని అమలు చేసింది. ఇప్పుడు.. నీ ఇంటికొస్తా.. నీ నట్టింటికొస్తా అన్నట్లు.. ప్లాన్- C తో.. ఏకంగా ఫిరాయింపు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనే తాడోపేడో తేల్చుకునేందుకు రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే.. ముందుగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల గడ్డ నుంచి గర్జన స్టార్ట్ చేసింది. గద్వాల గర్జన సభకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కాంగ్రెస్ పార్టీలో చేరిన కృష్ణమోహన్‌రెడ్డిపై ప్రశ్నల వర్షం -మిగతా 3 లో




## వలసలపై హోరెత్తిన లండన్



- ఒకే రోజు వ్యతిరేక, అనుకూల నిరసనలు
- పోరాడకపోతే చనిపోతారని వలస వ్యతిరేక ర్యాలీకి ఎలాన్ మస్క్ మద్దతు

-3 లో



## రూ.లక్షల కోట్ల టెండర్లకు డబ్బులెక్కడివి?

- విద్యార్థులు, ఉద్యోగులకిచ్చేందుకు లేవా?
- విద్యారంగ సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం
- మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్- ప్రజా స్వేచ్ఛ

ఉద్యోగులకు డీఏ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేందుకు డబ్బులేవంటున్న రేవంత్ సర్కార్‌కు రూ.లక్షల కోట్ల టెండర్లకు డబ్బులెక్కడున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రేవంత్ సర్కారు నిర్లక్ష్యంతో డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ విద్యాంసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడి, 13 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుంటే విద్యాశాఖ మంత్రిగా సీఎం ఎక్కడ ఉన్నారని -మిగతా 3 లో

# దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ రక్షణ




### నెహ్రూ ఈశాన్య ప్రాంత ప్రజలకు చేసిన గాయాలు నేటికీ మానిపోలేదు

- పాక్ అబద్ధాలు కాంగ్రెస్ ఎజెండాలుగా మారుతున్నాయి
- రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం
- దరంగ్ జిల్లాలో బహిరంగ సభలో మోడీ కాంగ్రెస్‌పై కీలకవ్యాఖ్యలు

దరంగ్ - ప్రజా స్వేచ్ఛ

దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ రక్షణ కల్పిస్తోందని ప్రధాని మోడీ అన్నారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ప్రధాని ఆదివారం దరంగ్ జిల్లాలో బహిరంగ సభలో కాంగ్రెస్‌పై కీలకవ్యాఖ్యలు చేశారు. '1962లో చైనాతో యుద్ధం తర్వాత అప్పుడు ప్రధానిగా ఉన్న నెహ్రూ ఈశాన్య ప్రాంత ప్రజలకు చేసిన గాయాలు నేటికీ మానిపోలేదు. ప్రస్తుత తరం కాంగ్రెస్ ఆ గాయాలపై ఉప్పు చల్లుతోంది' అని మోడీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తన రాజకీయాల కోసం భారత్‌పై వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో జట్టు కట్టిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ -మిగతా 3 లో



## నేపాల్ ప్రధానిగా సుశీలా కర్కి బాధ్యతలు


- అవినీతిని అంతం చేస్తానని హామీ
- నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని 'అమరవీరులు'గా ప్రకటన, పరిహారం
- గాయపడిన వారికి ఉచిత వైద్యం

ఖాట్మాండు

: నేపాల్ తాత్కాలిక ప్రధాన మంత్రిగా సుశీలా కర్కి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధానమంత్రి కర్కి శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసింది. ఆదివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన కర్కి భద్రతా దళం, ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు. మేలో నేపాల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. నిరసనకారుల డిమాండ్‌కు అనుగుణంగా అవినీతిని అంతం చేస్తానని హామీ ఇచ్చారు. జెన్ జెడ్ తరం ఆలోచనలకు అనుగుణంగా మనమంతా పనిచేయాలని కర్కి అధికారులకు తెలిపారు. 'నిరసనకారుల బృందం డిమాండ్ చేస్తున్నది అవినీతి అంతం, సుపరిపాలన, ఆర్థిక సమానత్వం. మీరు, నేను వీటిని నెరవేర్చడానికి దృఢ నిశ్చయంతో ఉండాలని తెలిపారు. -మిగతా 3 లో


## హైదరాబాద్‌ను వణికించిన వాన

- జలమయమైన రహదారులు.. ట్రాఫిక్‌తో ప్రజల ఇక్కట్లు
- అఫ్జల్‌సాగర్ డ్రెయిన్‌లో కొట్టుకుపోయిన మామాఅల్లుళ్లు
- గచ్చిబౌలి పీఎస్ పరిధిలో గోడకూలి ఇద్దరు మృతి !
- రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు వానలు
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక



హైదరాబాద్- ప్రజా స్వేచ్ఛ

హైదరాబాద్ మహానగరంలో ఆదివారం రాత్రి గంటల వ్యవధిలోనే పలుచోట్ల భారీ వర్షం దంచికొట్టింది. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. ఈ క్రమంలోనే హబీబ్‌పూర్ పరిధిలోని అఫ్జల్‌సాగర్ డ్రెయినేజీలో మామా అల్లుళ్లు కొట్టుకుపోయారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో గోడకూలి ఇద్దరు చనిపోయినట్టు తెలుస్తోంది. దాన్ని నిర్ధారించాల్సి ఉంది. హైదరాబాద్ నగరంలోని పలు కాలనీల్లోని ఇండ్లలోకి పెద్ద ఎత్తున -మిగతా 3 లో



## నామేధస్సువిలువ రూ.200 కోట్లు

### స్వలాభం కోసం తెలివితేటలు వాడటం లేదు : గడ్కరీ

న్యూఢిల్లీ,

ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకంపై వస్తున్న ఆరోపణల్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కొట్టిపారేశారు. శనివారం నాగపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తన తెలివితేటలు, ఆలోచనలు అభివృద్ధి కోసమే తప్ప, స్వలాభం కోసం కాదని స్పష్టం చేశారు. 'నా మెదడు రూ.200కోట్ల విలువైనది.నిజాయితీగా ఎలా సంపాదించాలో తెలుసు' అని అన్నారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాలపై వస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. సోషల్‌మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారమంతా 'రాజకీయ ప్రేరేపితం' అని అన్నారు. ఇథనాల్ కలపటం వెనుక స్వీయ ప్రయోజనాలు, స్వార్థముందన్న ఆరోపణలపై గడ్కరీ పై విధంగా స్పందించారు.

## 26 మంది ప్రాణాల కంటే డబ్బు విలువైనదా?..



3 లో

- పహల్గామ్ ఉగ్ర దాడిలో జరిగిన ప్రాణ నష్టం కంటే ఆర్థిక లాభాలు ముఖ్యమా?
- మతం అడిగి కాల్చి చంపిన పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడకుండా తిరస్కరించే అధికారం మీకు లేదా?
- భారత్, పాక్ మ్యాచ్‌పై అసదుద్దీన్ ఆగ్రహం

## 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం

### బరువు తక్కువున్న పిల్లలు 31.8 శాతం

- ఐదేండ్ల లోపు పిల్లల్లో 70 శాతం మేర రక్తహీనత బాధితులే
- ఈ ఏడాది 65 శాతానికి తగ్గించేలా సర్కారు లక్ష్యం
- పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు
- చిన్నారులు, మహిళల్లో పోషకాహార చైతన్య కార్యక్రమాలు
- ఇంటింటికీ సందేశం చేరవేయడమే సర్కారు లక్ష్యం
- విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు లేఖ రాసిన మంత్రి సీతక్క

3 లో



# ఈశాన్య భారతంలో భూకంపం




**గువాహటి - ప్రజా స్వేచ్ఛ**
ఈశాన్య భారతం, పశ్చిమ బెంగాల్‌లలో ఆదివారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత భూకంప లేఖినిపై 5.8గా నమోదైంది. ఆదివారం మధ్యాహ్నం 4.41 గంటలకు మొదటిసారి భూమి కంపించింది. ఆ తర్వాత గంటన్నర సమయంలో మూడుసార్లు చిన్న ప్రకంపనలు వచ్చాయి. అస్సాంలో భూకంపం వల్ల ఇద్దరు గాయపడగా, కొన్ని ఇండ్లు దెబ్బతిన్నాయి. మణిపూర్ పశ్చిమ ప్రాంతాలు, అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటా నగర్‌లలో కూడా భూమి కంపించింది.అస్సాం సరిహద్దుల్లోని పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై కూడా ఈ ప్రభావం కనిపించింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేసి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహాయపడతామని చెప్పారు.

# శంఖం ఊదితే నిద్రకు మంచిది!

శ్వాస ఆగిపోయే సమస్యకు ఉపశమనం
జైపూర్ వైద్యుల అధ్యయనం వెల్లడి



**జైపూర్,- ప్రజా స్వేచ్ఛ**
భారతీయ ప్రాచీన సంస్కృతిలోని ఆచారాలలో ఆరోగ్య రహస్యాలు ఎన్నో దాగి ఉన్నాయి. అలాంటి ఆరోగ్య రహస్యాన్ని తాజాగా వైద్య నిపుణులు గుర్తించారు. పూజలు నిర్వహించినప్పుడు శంఖం ఊదటం అనాదిగా ఆచారంగా వస్తున్నది. ఈ ఆచారంలో ఓ ఆరోగ్య సూత్రం దాగి ఉన్నట్టు నిపుణులు చెప్తున్నారు. కొందరికి నిద్రపోయినప్పుడు మధ్యలో కొన్ని సెకన్లపాటు హఠాత్తుగా శ్వాస ఆగిపోతుంది. దీంతో ఊపిరాడనట్టయి నిద్రలో మెలకువ వస్తుంది. దీనినే వైద్య పరిభాషలో స్లీప్ అప్నియా అంటారు. రోజూ శంఖం ఊదటం వల్ల మంచి నిద్ర పట్టడంతో పాటు స్లీప్ అప్నియా సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని వైద్యనిపుణులు చెప్తున్నారు.ఈ మేరకు జైపూర్‌కు చెందిన వైద్యనిపుణులు రాసిన పరిశోధన పత్రం యూరోపియన్ రెస్పిరేటరీ జర్నల్, న్యూస్ మెడికల్ లైఫ్ సైన్సెస్‌లో ప్రచురితమైంది. 19 నుంచి 65 ఏండ్ల వయసు గల వ్యక్తులపై జరిపిన అధ్యయనంలో కీలక విషయాలు కనుగొన్నట్టు వివరించారు. నిద్రలో అంతరాయాల సంఖ్య తగ్గడాన్ని గమనించినట్టు వైద్య నిపుణులు పేర్కొన్నారు. స్లీప్ అప్నియా సమస్యతో బాధపడేవారు ఆక్సిజన్, మెడిసిన్ సపోర్ట్ తీసుకుంటారు. కానీ శంఖం ఊదడం వల్ల సహజసిద్ధంగానే వాటి అవసరం తగ్గడాన్ని గమనించినట్టు వెల్లడించారు.

# బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌లో నటీమణులకు నోటీసులు





**న్యూఢిల్లీ, - ప్రజా స్వేచ్ఛ**
ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు కొనసాగుతున్నది. ఇప్పటికే పలువురు నటీనటులను విచారించిన ఈడీ..తాజాగా బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాతోపాటు, బెంగాల్ నటి, టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తికి నోటీసులు జారీ చేసింది.మిమి చక్రవర్తిని ఈనెల 15న, ఊర్వశిని ఈ నెల 16న ఢిల్లీలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. వీరిద్దరూ ప్రముఖ బెట్టింగ్ యాప్‌నకు ప్రచారం చేసినట్టు తెలిసింది. ఆర్థిక లావాదేవీలు, ప్రచారంలో వీరిద్దరి పాత్ర ఎంత మేరకు అన్నది తెలుసుకునేందుకు విచారణ అవసరమని ఈడీ భావిస్తున్నది.

# ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలి..

ఓట్ల చోరీపై మాజీ సీఈసీ ఖురేషీ

**న్యూఢిల్లీ-- ప్రజా స్వేచ్ఛ**
ఎన్నికల విషయంలో తాము ఏం చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం అనే విషయాలను ఎన్నికల సంఘం ఆత్మ పరిశీలన చేసుకోవాలని మాజీ కేంద్ర ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషీ అన్నారు. పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఓట్ల చోరీపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడానికి బదులు వాటిపై దర్యాప్తునకు ఈసీ ఆదేశించి ఉండాల్సిందన్నారు.బీహార్‌లో ఈసీ 'సర్'ను నిర్వహించిన విధానాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఎన్నికల కమిషన్ ఓటర్లు, ప్రతిపక్షాల విశ్వాసాన్ని గెలుచుకొనేలా ఉండాలని అన్నారు. ఈసీపై వస్తున్న విమర్శలను చూసి తీవ్ర ఆవేదనకు గురవుతున్నానని ఆయన తెలిపారు.



# బీహార్‌లో అన్ని చోట్ల ఆర్జేడీ పోటీ

కాంగ్రెస్ కూటమిపై ఒత్తిడి పెంచిన ఆర్జేడీ నేత తేజస్వి
సీట్ల పంపకంపై ప్రతిష్ఠంభన



**పాట్నా - ప్రజా స్వేచ్ఛ )**
రానున్న బీహార్ శాసన సభ ఎన్నికల్లో అన్ని నియోజక వర్గాల్లోనూ ఆర్జేడీ పోటీ చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత తేజస్వి ప్రసాద్ యాదవ్ చెప్పారు. ముజఫర్‌పూర్ జిల్లాలోని కంటి పట్టణంలో ఆదివారం జరిగిన ఆర్జేడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకంలో ప్రతిష్టంభన ఏర్పడిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. తేజస్వి మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు.తన తండ్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ సాధించిన విజయాలను వివరించారు. ఆర్జేడీ పోటీ చేయబోతున్న కొన్ని నియోజకవర్గాల పేర్లను కూడా ఆయన చెప్పారు. వీటిలో ఒకదానిలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు. సీట్ల పంపకాల చర్చల్లో మిత్ర పక్షాలపై ఒత్తిడి పెంచడం కోసమే ఆయన ఈ విధంగా ప్రకటించారని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు, వీఐపీ, జేఎంఎం, ఎల్‌జేపీ (పరాస్ వర్గం) ఉన్నాయి. కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను ఆశిస్తున్నట్లు సమాచారం.

# హిందూ మతంలో సమానత్వం ఉంటే ఎందుకు మారుతారు?..


సీఎం సిద్ధరామయ్య వివాదాస్పద వ్యాఖ్యలు



**బెంగళూరు - - ప్రజా స్వేచ్ఛ**
'హిందూ మతంలో సమానత్వం, సమాన అవకాశాలు ఉంటే ఎవరైనా ఎందుకు మతం మారతారు? అంటరానితనాన్ని మేమేమన్నా తెచ్చామా?' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కుల గణనపై మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇతర మతాల్లోనూ అసమానతలు ఉండొచ్చుని.. తామైనా, బీజేపీ అయినా మతం మారమని ప్రజలను అడగమని.. కానీ అది వారి హక్కు అని ఆయన అన్నారు.దీనిపై బీజేపీ స్పందిస్తూ ఇస్లాంను ప్రశ్నించే ధైర్యం కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఉందా? అని ప్రశ్నించింది. 'ఇస్లాంలో కనుక సమానత్వం ఉన్నట్టయితే మహిళలను మసీదుల్లోకి ఎందుకు అనుమతించడం లేదు? ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడాన్ని ఎందుకు వ్యతిరేకించారు? ముస్లిమేతరులు, హిందువులను ఖురాన్‌లో కాఫిర్లుగా ఎందుకు పిలుస్తున్నారు? ఇవన్నీ అడిగే ధైర్యం మీకుందా? అని బీజేపీ నేత ఆర్ అశోక ఎక్స్‌లో ప్రశ్నించారు.

# తల్లి పేరుతో ఓట్ల వేట!..

అస్సాం సభలో ప్రధాని మోదీ
కాంగ్రెస్ దూషణలను
విషంలా గొంతులో దాచుకుంటా



**గువాహటి- ప్రజా స్వేచ్ఛ**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన తల్లి పేరు చెప్పుకుంటూ బీహార్ శాసన సభ ఎన్నికల్లో ఓట్ల వేట సాగిస్తున్నారు! ఆయన అస్సాంలో మాట్లాడినా, మనసు మాత్రం బీహార్‌లోనే ఉన్నట్లు కనిపించింది. అస్సాంలోని దరంగ్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, "మొత్తం కాంగ్రెస్ వ్యవస్థ నన్ను లక్ష్యంగా చేసుకుంటుందని నాకు తెలుసు. మోదీ మళ్లీ ఏడుస్తున్నాడు అని అంటుంది. ప్రజలే నా దేవుళ్లు. నా బాధను వారి ముందు చెప్పుకోకపోతే, ఎవరికి చెప్పుకుంటాను? వాళ్లే నా యజమానులు, నా దేవుళ్లు, నా రిమోట్ కంట్రోల్. నాకు వేరే ఇతర రిమోట్ కంట్రోల్ లేదు" అని ఆయన అన్నారు. తాను మహా శివుడి భక్తుడినని, శివుడు విషాన్ని మింగినట్లుగానే, తనపై వచ్చే దూషణల విషాన్ని తాను మింగుతానని తెలిపారు.ఇటీవల బీహార్‌లో ఆర్జేడీ-కాంగ్రెస్ బహిరంగ సభలో కొందరు మోదీ తల్లి హీరాబెన్‌ను దూషించినట్లు వార్తలు వచ్చాయి. ఈ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినపుడు తమ నేతలెవరూ వేదికపై లేరని కాంగ్రెస్ తెలిపింది. ఆ తర్వాత కాంగ్రెస్ ఓ ఏఐ వీడియోను విడుదల చేసింది. మోదీతో హీరాబెన్ మాట్లాడుతున్నట్లు దీనిలో కనిపించింది. బీహార్ శాసన సభ ఎన్నికలు త్వరలో జరుగుతాయి. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు, వీఐపీ వంటి పార్టీలు మహా కూటమిగా ఏర్పడి పోటీ చేయబోతున్నాయి. బీజేపీ, జేడీయూ కలిసి పోటీ చేస్తాయి. ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ కూడా బరిలో దిగబోతున్నది.

# లష్కరే ఆఫీస్ పునర్నిర్మాణానికి పాక్ నిధులు!



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈ ఏడాది మే 7న భారత వాయుసేన చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో మురిద్కేలోని లష్కరే తాయిబా (ఎల్‌ఈటీ) ప్రధాన కార్యాలయం మార్కజ్ తాయిబా పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో ఉగ్రవాదుల ఆయుధాగారాలు, శిక్షణ కేంద్రాలు నాశనమయ్యాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం పాకిస్థాన్ ఈ ఉగ్రవాద సంస్థ పునర్నిర్మాణానికి నేరుగా నిధులు సమకూరుస్తున్నట్టు తెలిసింది.లష్కరేకు ప్రభుత్వం ఇప్పటికే రూ.4 కోట్లు కేటాయించింది. మొత్తం పునర్నిర్మాణానికి రూ.15 కోట్లకు పైగా ఖర్చవుతుందని సంస్థ అంచనా వేస్తున్నది. లష్కరే కమాండర్లు మౌలానా అబూ జార్, యూనస్ షా బుఖారీ ఈ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్నట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నాటికి ఈ నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో వారు పనిచేస్తున్నారు.

# బిచ్చగాళ్ల గృహాల్లో సదుపాయాలు కల్పించండి


కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
ప్రభుత్వాలు బిచ్చగాళ్ల కోసం సత్రాలను నిర్వహించడం దాతృత్వం కాదని, వాటి నిర్వహణలో రాజ్యాంగ విలువలు ప్రతిబింబించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఇటువంటి కేంద్రాల్లో నిరంతరం హుందాతనంతో కూడిన జీవన పరిస్థితులు ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించింది.రాజ్యాంగం కల్పించిన గౌరవప్రదంగా జీవించే హక్కు సమాజంలో అత్యంత బలహీన వర్గాలైన బిచ్చగాళ్ల విషయంలో అమలు చేయాలని పేర్కొంది. ప్రభుత్వాలు నిర్వహించే యాచక గృహాలు, అటువంటి ఇతర సంస్థల్లో మానవీయ పరిస్థితులను కల్పించడంలో విఫలమవడం అసమర్థ, నిర్లక్ష్య పరిపాలన అవుతుందని వివరించింది.

# పసిఫిక్ సముద్రం అడుగు భాగంలో అరుదైన చేపలు..!

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
పసిఫిక్ సముద్రం అడుగు భాగంలో మూడు సరికొత్త క్యూట్ చేపల ను బయాలజిస్టులు కనుగొన్నారు. సముద్రంలో వేల అడుగుల లోతున ఇవి సంచరిస్తున్నట్లు గుర్తించారు. పింక్ రంగులో ఉండే బొడిపెలున్న స్నెయిల్ ఫిష్ కెమెరాలకు చిక్కింది. సాధారణంగా నీటి అడుగు భాగంలో పదునైన దంతాలుండే మాన్‌స్టర్ లాంటి జీవులుంటాయని భావిస్తుంటారు. కానీ స్నెయిల్ ఫిష్ క్యూట్‌గా ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.గత నెల 27న 'బయోవన్' జర్నల్‌లో ప్రచురించిన పత్రంలో ఈ చేపల పేర్లను వారు వెల్లడించారు. రౌండ్‌గా తల ఉన్న పింక్ చేపకు కేర్‌ప్రొక్టస్ కొలికలి అని, నల్లని రౌండ్ తల ఉన్న చేపకు కేర్‌ప్రొక్టస్ యాన్సెయి అని, పొడవుగా ఉన్న చేపకు పారాలిపారిస్ ఎమ్ అని పేర్లు పెట్టారు. ఇందులో బంపీ స్నెయిల్ ఫిష్ సముద్ర ఉపరితలం నుంచి 10,722 అడుగుల లోతున ఉంటుంది. మిగిలిన రెండు చేపలు 13,513 అడుగుల లోతున ఉంటాయి.



# దేశాభివృద్ధిలో ఇంజినీర్లది కీలకపాత్ర

(మొదటి తరువాయి)

సీఎం గుర్తుచేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరుగా, దార్శనికుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారని తెలిపారు. అత్యుత్తమ సాంకేతికతతో వివిధ రంగాల్లో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయని సీఎం చెప్పారు. మూసీ వరదల నుంచి హైదరాబాద్ నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు, ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఇంజనీరింగ్ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు అందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్స్ తమవంతు పాత్ర పోషించాలని సీఎం పిలుపునిచ్చారు.

## సుప్రీంకోర్టులో పెండింగ్‌కేసులు 88 వేలకు పైనే..

(మొదటి తరువాయి)

ప్రారంభమయింది. పెండింగ్ కేసులను తగ్గించడానికి వేసవి సెలవుల్లో కూడా అదనపు ధర్మాసనాలతో పని చేసినా పెండింగ్ కేసులు పెరిగాయి. ఈ ఏడాది మే 23 నుంచి జులై వరకు ఉన్న వేసవి సెలవులను 'పాక్షిక పని దినాలు'గా పేరు మార్చి మొత్తంగా 21 ధర్మాసనాలు కేసులను విచారించాయి. ఈ ఏడాదిలో ఆగస్టు వరకూ 52,630 కొత్త కేసులు దాఖల య్యాయి. అలాగే 46,309 కేసులను పరిష్కరించారు. అలాగే ఈ ఏడాదిలో సుప్రీంకోర్టు ఇద్దరు ప్రధాన న్యాయమూర్తులను చూసింది. నవంబర్‌లో మరొక ప్రధాన న్యాయమూర్తి (జస్టిస్ సూర్యకాంత్) నవంబర్‌లో ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. గతేడాది ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ బిఆర్ గవారు పెండింగ్ కేసులను తగ్గించడానికి ఎంతగానో కృషిచేసినా.. పెండింగ్ కేసులు 82 వేలకు పైగా చేరుకు న్నాయి. కరోనా లాక్‌డౌన్ నుంచి పెండింగ్ కేసుల సమస్య తీవ్రంగా మారింది. దీంతో జస్టిస్ చంద్రచూడ్ సుప్రీం కోర్టుల జడ్జీల ఖాళీలను భర్తీ చేయడానికి ఎంతగానో కృషి చేశారు. అలాగే, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ గవై కూడా తమ కొలీజియంల ద్వారా కేంద్రానికి సుప్రీంకోర్టు జడ్జీల పేర్లను వేగంగా సిఫార్సులు చేసేవారు. అయినా పెండింగ్ కేసులు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. అలాగే, గత ప్రధాన న్యాయమూర్తులు, కొలీజియంలు కూడా 'భారీ పనిభారం', 'అధిక ఒత్తిడి' అంశాలను లేవనెత్తాయి. పనిభారం ఎంతగా ఉందంటే ఒక్క ఖాళీని కూడా కోర్టు భరించలేని స్థితికి చేరుకుందని తెలిపాయి. దీంతోనే సుప్రీంకోర్టు కొలిజియం సిఫారసు లను వేగంగా ఆమోదించాల్సిన స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉంది.

## వలసలపై హోరెత్తిన లండన్

**ఒకే రోజు వ్యతిరేక, అనుకూల నిరసనలు**

**పోరాడకపోతే చనిపోతారని వలస వ్యతిరేక ర్యాలీకి ఎలాన్ మస్క్ మద్దతు**




**లండన్:**
బ్రిటన్‌లోని వలసదారులకు వ్యతిరేకంగా, అనుకూలంగా శనివారం లండన్‌లో జరిగిన రెండు ర్యాలీలు ఉద్రిక్తంగా మారాయి. 'వలస వ్యతిరేక ర్యాలీ'లో లక్ష మందికిపైగా పాల్గొన్నారు. ఈ ర్యాలీకి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతు తెలిపారు. ప్రధాని కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. 'బ్రిటన్ ఇప్పుడు అక్రమ వలసలతో నిండిపోయింది. హింసను కోరుకోకపోయినా..విధ్వంసం మీ వరకు వస్తుంది.ఇప్పుడు మీ వద్ద ఉన్నవి రెండే మార్గాలు. తిరిగి పోరాడండి. లేదంటే చనిపోతారు' అని మస్క్ అన్నారు. మరోవైపు వలసదారులకు మద్దతుగా 'స్టాండ్ అప్ టు రేసిజమ్' పేరుతో మరొక గ్రూప్ నిరసనలు చేపట్టింది. ఈ రెండు నిరసనలు అదుపు తప్పడంతో హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనల్లో 26 మంది పోలీసులు గాయపడ్డారు. ప్రదర్శన చివరి దశలో కొంతమంది అదుపు తప్పారు.

## రూ.లక్షల కోట్ల టెండర్లకు డబ్బులెక్కడివి?



(మొదటి తరువాయి)

ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీకి రూ.ఫ్యూచర్ సిటీకి 20వేల కోట్లు, మల్లన్నసాగర్ నుంచి మూసిలో గోదావరి నీళ్లు పోసేందుకు రూ.7,000 కోట్లు, జీహెచ్ఎంసీలో హై లెవెల్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు నిర్మించేందుకు రూ.7 వేల కోట్లు, ఫ్యూచర్ సిటీలో ఆరు లైన్ల రోడ్డు కోసం రూ.5 వేల కోట్లు, హెచ్ఎండిఏలో రూ.10 వేల కోట్లు, ఆర్ అండ్ బిలో రూ.16 వేల కోట్లు, గురుకులాలను గాలికి వదిలి రూ.25 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ రూ.4,400 కోట్లు, మూసీ సుందరీకిరణకు రూ.లక్ష యాభై వేల కోట్లు మొత్తం రూ.2.5 లక్షల కోట్ల టెండర్లను కమిషన్ల దండుకునేందుకు రేవంత్ రెడ్డి పిలుస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ 9 ఏళ్లలో కరోనా, ఆర్థిక మాంద్యం సమయంలోనూ రూ.20 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసిందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో సగానికి సగం జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలు పేరుకు పోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి యాజమాన్యాలదైతే, సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూడైస్ రిపోర్ట్ ప్రకారం ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో 47 వేల మంది పిల్లలు తగ్గారని తెలిపారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని ఇచ్చిన హామీని సర్కారు విస్మరించిందని విమర్శించారు. ఇప్పటికైనా బలహీనవర్గాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయిం బర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్..

(మొదటి తరువాయి)

కురిపించారు. పార్టీ మార్పుపై గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ సెటైర్లు వేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు కేటీఆర్. అయితే.. ఈ లోపే 10మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. ఎవరి సత్తా ఏంటో తేల్చుకునేందుకు సిద్ధమా అని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు.ఇక.. 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలన్న కేటీఆర్ కామెంట్స్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్ ఇచ్చారు. రేవంత్‌కు సవాల్ విసిరే ముందు గతాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. మొత్తంగా.. తెలంగాణలోని ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో బీఆర్ఎస్ అసెంబ్లీలో, సుప్రీంకోర్టులో పోరాటం చేస్తూనే.. ఇప్పుడు ప్లాన్-C వ్యూహాన్ని స్టార్ట్ చేయడం మరింత ఆసక్తి రేపుతోంది. అయితే.. ఫిరాయింపుల విషయంలో ఫ్లాష్ బ్యాక్‌కు వెళ్లాలంటూ కౌంటర్ ఎటాక్‌కు దిగిన కాంగ్రెస్.. బీఆర్ఎస్ ప్లాన్- C వ్యూహంపై ఎలా ముందుకు వెళ్తుంది అన్నది వేచి చూడాలి. అయితే ఈ సభలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. ఇది రాజకీయాల్లో కొత్త వ్యూహానికి తెర తీసిందని విశ్లేషకులు అంటున్నారు.గతంలో కూడా ఇలాంటివి చూశాం, కానీ ఇవి ఇంత దూకుడుగా ఎప్పుడూ లేవు. గతంలో ఎన్నో పార్టీలు ఇతర పార్టీల నాయకులను చేర్చుకున్నాయి. కానీ అవి అసెంబ్లీలో అంత దూకుడుగా వ్యవహరించలేదు, కోర్టుల్లో అంత పోరాటం చేయలేదు. ఇప్పుడు బీఆర్ఎస్ కొత్త మార్గాన్ని ఎంచుకుని, ప్రజల ముందు ఆ సమస్యను ఉంచుతోంది. ఇది ప్రజల స్పందనను ప్రభావితం చేయవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్ఎస్ చేసిన ఈ కొత్త వ్యూహం కాంగ్రెస్‌కి ఒక పరీక్షగా మారింది. కాంగ్రెస్ నాయకులు ఈ వ్యూహాన్ని ఎలా ఎదుర్కొంటారన్నది చూడాలి. వారు కూడా అదే స్థాయిలో ప్రతిదాడికి దిగుతారా, లేక వేరే మార్గం అనుసరిస్తారా? ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ కూడా ఫ్లాష్ బ్యాక్‌కు వెళ్తూ ప్రతిదాడికి దిగడం ఆసక్తికరంగా మారింది. ఇది రాజకీయాల్లో ఒక కొత్త పర్వం ప్రారంభమైనట్లుగా కనిపిస్తోంది.మొత్తంగా, ఈ మొత్తం వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారింది. బీఆర్ఎస్ ప్లాన్-%జ% వ్యూహం ఎంతవరకు ఫలిస్తుంది, కాంగ్రెస్ దానిని ఎలా ఎదుర్కొంటుంది అనేది భవిష్యత్తులో మనం చూడబోయే కీలక అంశం. ఈ రాజకీయ వ్యూహం తెలంగాణ రాజకీయాలను కొత్త దిశకు తీసుకెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ఇది రాజకీయాల్లో ఎంతో కాలం కొనసాగుతుందని కూడా వారు చెప్పారు.

# హైదరాబాద్‌ను వణికించిన వాన

(మొదటి తరువాయి)

నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల వ్యవధిలో అతి భారీ వర్షం పడటంతో నగర రోడ్లన్నీ జలమయమై పోయాయి. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించి పోయింది. రాష్ట్రవ్యాప్తంగా 362 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైతే అందులో 130కిపైగా ప్రాంతాలు జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. దీంతో నగరంలోని రహదారులు జలమయ మైపోయాయి. ట్రాఫిక్‌తో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టి అన్నారం లో అత్యధికంగా 12.75 సెంటీమీటర్ల అతి భారీ వర్షం కురిసింది. ఆ తర్వాత హైదరాబాద్ జిల్లాలోని ముషీరాబాద్‌లో 12.10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జంజారాహిల్స్, జూబ్లీహి ల్స్, అమీర్‌పేట్, ఎస్సార్ నగర్, పంజాగుట్ట, మాదాపూర్, తార్నాక, లక్డికాపూల్, మల్కాజిగిరి, కాప్రా, మారేడుపల్లి, సరూర్‌నగర్, ముషీరాబాద్, హిమాయత్ నగర్, కాచిగూడ, ఉప్పల్, లాలాపేట్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, సైనిక్‌పురి, కూకట్‌పల్లి, గాజుల రామారం, అల్వాల్, దిల్‌సుఖ్‌నగర్ సహా తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. దాంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లు, కాలనీల్లోకి నీరు రావడంతో జనం ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల సెల్లార్లు నీటితో నిండిపో యాయి. ప్రధాన రహదారులపై మోకాళ్ల నుంచి నడుంలోతు వరకు నీరు చేరడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. భారీ వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో జనం ఇండ్లకే పరిమిత మయ్యారు. ప్రధాన రహదారులు మొదలుకొని అంతర్గత రహదారులు చెరువులను తలపించాయి. పలు ప్రాంతాల్లో వాహనాలు నీటిలో మునిగాయి. ఫ్లై ఓవర్లపైన కూడా మోకాళ్లలోతు నీరు నిలిచింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 కమాండ్ కంట్రోల్ వద్ద రోడ్డుపైన భారీ ఎత్తున నీళ్లు నిలిచాయి. దాంతో అక్కడ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిలిచిన వర్షపు నీటినిహైడ్రా అధికారులు, సిబ్బంది డైవర్ట్ చేశారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి పర్యవేక్షిం చారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షం కారణంగా గోడ కూలి ఇద్దరు మృతిచెందారని సమాచారం. డీఆర్ఎఫ్ మాన్సున్ టీమ్స్ రంగంలో కి దిగాయి. వర్షపునీరు చేరిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయి. తెలంగాణలో వచ్చే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ నాగరత్న తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తు న్నాయని పేర్కొన్నారు.

## 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం

- బరువు తక్కువున్న పిల్లలు 31.8 శాతం
- ఐదేండ్ల లోపు పిల్లల్లో 70 శాతం మేర రక్తహీనత బాధితులే
- ఈ ఏడాది 65 శాతానికి తగ్గించేలా సర్కారు లక్ష్యం
- పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు
- చిన్నారులు, మహిళల్లో పోషకాహార చైతన్య కార్యక్రమాలు
- ఇంటింటికీ సందేశం చేరవేయడమే సర్కారు లక్ష్యం
  విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు లేఖ రాసిన మంత్రి సీతక్క



**హైదరాబాద్**
తెలంగాణలో ఐదేండ్లలోపు బరువు తక్కువ ఉన్న పిల్లలు 31.8 శాతం మంది ఉన్నారు. ఐదేండ్ల లోపు పిల్లల్లో 70 శాతం వరకు రక్తహీనత బాధపడుతున్నారు. అదే 15 ఏండ్ల నుంచి 19 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న యువతుల్లో 64.7 శాతం మంది రక్తహీనత బారినపడ్డారు. 15 ఏండ్ల నుంచి 49 ఏండ్ల లోపు మహిళల్లో ఈ శాతాన్ని చూసుకుంటే 57.6 శాతం మంది ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటికీ సమతుల్య, పోషక ఆహారం తీసుకోకపోవడమే కారణమని స్పష్టమవుతున్నది. ఆర్థికలేమితో ఇబ్బంది పడుతున్న కుటుంబాలు చాలామేరకు పోషకాహారానికి దూరంగానే ఉంటున్నాయి. రాష్ట్రంలో ములుగు, కొత్తగూడెం, మెదక్, మహబూబాబాద్, వికారాబాద్, ఆసిఫాబాద్, నారాయణపేట జిల్లాల్లో పిల్లలకు సరైన పౌష్టికాహారం అందట్లేదని ప్రభుత్వ సర్వేల్లో తేలింది. కొంతలో కొంత మేరకు నష్టనివారణ చర్యలు చేపట్టేందుకు మిలెట్స్‌తో తయారు చేసిన చిక్కీలను అందించాలని రాష్ట్ర సర్కారు ఇటీవల నిర్ణయం తీసుకున్నది. అయితే, అవి ఆసిఫాబాద్, కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల్లో మాత్రమే కిషోర బాలికలకు అందుతున్నాయి. వారికి సరైన రీతిలో పోషకా హారాన్ని అందించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో విజయవంతం కాలేకపోతు న్నాయి. నిత్యం చైతన్య కార్యక్రమాలు జరుగుతున్నా ఆశించిన ఫలితాలు రావట్లేదంటే అవి మొక్కుబడిగా జరుగుతున్నట్టే లెక్క. సమతుల్య ఆహారం అందించడంలోనూ, చైతన్యం కల్పించడం లోనూ పాలకులకు, ప్రజలకు మధ్య ఎక్కడో గ్యాప్ వస్తున్నదని స్పష్టమవుతున్నది. 2025-26లో ఐదేండ్ల లోపు రక్తహీనతతో బాధపడుతున్న పిల్లల శాతాన్ని 70 నుంచి 65 శాతానికి తగ్గించాలని రాష్ట్ర సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది.

# దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ రక్షణ

(మొదటి తరువాయి)

సమయంలోనూ ఆ విషయం బయటపడింద న్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టిందన్నారు. కానీ, హస్తం పార్టీ మాత్రం మన సైన్యానికి కాకుండా దాయాది దేశంలోని సైన్యానికి మద్దతిచ్చిందన్నారు. పాక్ అబద్ధాలు కాంగ్రెస్ ఎజెండాలుగా మారుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆక్రమణదారులకు, దేశ వ్యతిరేకులకు ఆ పార్టీ రక్షణ కవచంగా మారిందంటూ.. వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటన్నారు. ఈ కార్యక్రమానికి ముందు దరంగ్ జిల్లాలోని మంగల్‌డోరులో రూ.6,300 కోట్ల విలువైన ఆరోగ్య, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దరంగ్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణంతో పాటు, నర్సింగ్ కాలేజీ, జీఎన్ఎం పాఠశాలను ప్రారంభించారు.

## నేపాల్ ప్రధానిగా సుశీలా కర్కి బాధ్యతలు

(మొదటి తరువాయి)

ఆదివారం సింఘా దర్బార్‌లోని ప్రభుత్వ సముదాయంలో సమావేశాలు ప్రారంభమయ్యే ముందు నిరసనల్లో మరణించిన వారికి కర్కి ఒక నిమిషం మౌనం పాటించారు. కాగా, రెండు రోజుల నిరసనల్లో 72 మంది మరణించారని, 191 మంది గాయపడ్డారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏకనారాయణ్ ఆర్యల్ ఆదివారం తెలిపారు. అలాగే నిరసనల్లో మరణించిన వారిని ప్రభుత్వం అమరవీరులుగా గుర్తించిందని ఆర్యల్ ప్రకటించారు. వీరి కుటుంబాలకు ఒక్కొక్కరికీ 10 లక్షల నేపాలీ రూపాయిల పరిహారం అందచేస్తామని తెలిపారు. అలాగే, గాయపడిన వారికి ఉచిత వైద్య సహాయం అందించాలని ఆసుపత్రులను ప్రభుత్వం ఆదేశించిందని, ఇప్పటికే ఉచిత చికిత్స ప్రారంభమయిందని తెలిపారు.

**కర్కి నియామకాన్ని స్వాగతించిన అమెరికా**

నేపాల్ తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధానమంత్రిగా సుశీలా కర్కి నియామకాన్ని అమెరికా స్వాగతించింది. అశాంతి నుంచి స్థిరత్వం వైపు అడుగుగా దీన్ని వర్ణించింది. ఈ మేరకు నేపాల్‌లోని అమెరికా రాయబారి డిన్ ఆర్ థాంప్సన్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. సంక్షోభ సమయంలో ప్రజాస్వామ పద్ధతిలో పరిష్కారానికి నిబద్ధత చూపినందుకు అధ్యక్షులు రామచంద్ర పౌడెల్, యువనాయకులను ప్రశంసించారు. అలాగే, ఈ ప్రక్రియలో నేపాలీ సైన్యం, చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్ పాత్రను కూడా ఆయన గుర్తించారు. తాత్కాలిక ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి అమెరికా ప్రభుత్వం ఎదురుచూస్తుందని తెలిపారు. నేపాల్ నష్టాలపై అమెరికా విచారం వ్యక్తం చేస్తుందని, అయితే ఈ రాజకీయ పరిష్కారం శాంతియుతంగా నేపాల్ ముందుకు సాగడానికి ఒక అవకాశాన్ని అందిస్తుందని అమెరికా రాయబారి తెలిపారు.

## 26 మంది ప్రాణాల కంటే డబ్బు విలువైనదా?..

**పహల్గామ్ ఉగ్ర దాడిలో జరిగిన ప్రాణ నష్టం కంటే ఆర్థిక లాభాలు ముఖ్యమా?**

**మతం అడిగి కాల్చి చంపిన పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడకుండా తిరస్కరించే అధికారం మీకు లేదా?**

**భారత్, పాక్ మ్యాచ్‌పై అసదుద్దీన్ ఆగ్రహం**



**హైదరాబాద్:**
ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్ర దాడిలో మరణించిన 26 మంది ప్రాణాల కంటే డబ్బు విలువైనదా? అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడటానికి భారత్ జట్టును అనుమతించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. పహల్గామ్ ఉగ్ర దాడిలో జరిగిన ప్రాణ నష్టం కంటే ఆర్థిక లాభాలు ముఖ్యమా? అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 'అస్సాం ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, మిగతా వారందరికీ (బీజేపీ నేతలకు) నా ప్రశ్న ఏమంటే, పహల్గామ్‌లో 26 మంది పౌరులను మతం అడిగి కాల్చి చంపిన పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడకుండా తిరస్కరించే అధికారం మీకు లేదా?' అని నిలదీశారు.కాగా, పహల్గామ్ ఉగ్ర దాడిలో మరణించిన 26 మంది పౌరుల ప్రాణాల కంటే ఈ మ్యాచ్ ద్వారా సంపాదించిన డబ్బు విలువైనదా? అని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. 'ప్రధానమంత్రిని మేం అడుగుతున్నాం. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని, ఉగ్రవాదం, చర్చలు కలిసి జరుగవని మీరు చెప్పారు. ఒక క్రికెట్ మ్యాచ్ నుంచి బీసీసీఐకి ఎంత డబ్బు వస్తుంది. రూ. 2000 కోట్లా, రూ. 3000 కోట్లా? మన 26 మంది పౌరుల ప్రాణాల కంటే ఈ డబ్బు విలువ ఎక్కువా?' అని నిలదీశారు. 26 మంది బాధిత కుటుంబాల వెంట తాము నిన్న ఉన్నామని, రేపు కూడా ఉంటామని అన్నారు.

## సంపాదకీయం

# సుప్రీంకోర్టు దృఢ వైఖరితో సమాఖ్యకు రక్ష

ఎంత ఉన్నత పదవిలో వున్న వారికైనా తాము రాజ్యాంగ పరంగా చెప్పవలసింది చెబుతామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ధర్మాసనం ప్రకటించడం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా స్వాగతించ దగింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై అభిప్రాయం చెప్పడంలో అంతులేని జాప్యం చేస్తున్న గవర్నర్ల పాత్రపై ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పును తాము తిరగదోడే ప్రసక్తి వుండబోదని కూడా అత్యున్నత న్యాయస్థానం సూచన ప్రాయంగా చెప్పేసింది. రాజ్యాంగ పరంగా ఏమి జరగాలనేది తాము సూచిస్తామే తప్ప గతంలో కోర్టు ఇచ్చిన తీర్పుపై మళ్లీ జోక్యం చేసుకోబోమని సిజెఐ ఇంతకు ముందే తేల్చేశారు. ప్రస్తుతానికి తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు తమకు న్యాయం చేస్తుందని ప్రత్యేకించి బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించడం సహజం.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది బిల్లులను అంతులేని జాప్యంతో అట్టి పెట్టుకోవడంపై స్టాలిన్ ప్రభుత్వం దాఖలు చేసిన కేసును సుప్రీంకోర్టు విచారించింది. తమ ముందుకు వచ్చిన బిల్లులపై మూడు మాసాలలోగా ఆమోదం లేదా నిరాకరణ చేయవలసి ఉంటుందని తేల్చి చెప్పింది. అలా చేయకపోతే ఆ బిల్లులను ఆమోదించినట్టే భావించాల్సి వుంటుందని కూడా నిర్దేశించింది. ఒకవేళ రాష్ట్రపతి పరిశీలనకు పంపేట్లయితే అప్పుడు కూడా మూడు మాసాల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రకటించింది. ఈ తీర్పు తీవ్ర సంచలనం కలిగించింది. ఎందుకంటే కేంద్రంలో మోడీ అధికారం చేపట్టాక నియమితులైన గవర్నర్లు రాజును మించిన రాజభక్తుల్లా ఎన్‌డిఎ ఏతర రాష్ట్ర సర్కార్లను అవస్థ పెట్టడం, అడుగడుగునా గండాలు సృష్టించడం పరిపాటిగా మారింది. వైస్ ఛాన్సలర్ల నియామకం నుంచి బిల్లుల ఆమోదం, శాసనసభల్లో ప్రసంగ పాఠంతో సహా ప్రతిదీ వివాదం చేస్తున్న పరిస్థితి. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశం ఈ అనిశ్చితిని ఆపడానికి దోహదపడుతుందనే హర్షామోదాలు వ్యక్తమైతే బిజెపి అనుకూల పక్షాలూ, న్యాయవాద వర్గాలు రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఎలా ఆదేశాలిస్తుందని అభ్యంతరాలు లేవనెత్తాయి.

ఏప్రిల్ 8వ తేదీన తీర్పు రాగా ఆ మరుసటి రోజునే కేంద్రం దానికి ఎలా విరుగుడు చేయాలని మంతనాలు ప్రారంభించింది అటార్నీ జనరల్ ఆర్. వెంకట రమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇంకా న్యాయశాఖ ప్రతినిధులతో విస్తారంగా చర్చలు సాగించారు. ఈ తీర్పుపై సమీక్ష కోరాలా లేక మరింత విస్తృత ధర్మాసనం కోరాలా అని తర్జనభర్జనలు జరిపారు. రాజ్యాంగం 143(1) అధికరణం కింద రాష్ట్రపతి పేరిట సలహా కోరడమే ఉపయోగకరమని నిర్ణయానికి వచ్చారు. చివరకు మే ఏడవ తేదీ నాటికి రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు సమర్పించే ప్రశ్నావళి ప్రస్తావనను ఖరారు చేశారు. రాజ్యాంగంలోని 200వ అధికరణం గవర్నర్ పరిధిని చెప్తుంది. 21వ అధికరణం శాసనసభ ఆమోదించిన బిల్లుల అంగీకార ముద్ర గురించి చెప్తుంది. ఈ రెండు చోట్ల కూడా కాలపరిమితికి సంబంధించిన నిబంధనలేవీ లేనప్పుడు మూడు మాసాలలోనే పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఎలా చెప్తుందనేది ఈ ప్రశ్నల సారాంశం.

ఈ విధంగా రాష్ట్రపతి సుప్రీం కోర్టు అభిప్రాయం కోరడం గతంలోనూ జరిగింది గానీ ఆ సందర్భాలు వేరు. 1960లో కేంద్రం సి జాబితాలోని రాష్ట్రాల ప్రతిపత్తిపై సుప్రీం సూచనలు కోరింది. పాకిస్తాన్‌తో ప్రాదేశిక భూభాగంపై ఒప్పందం చేసుకోవచ్చునన్న విషయం 1951లో సుప్రీంకోర్టు అభిప్రాయం కోరింది. 1978లో ఎమర్జెన్సీ తర్వాత ఆ అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయవచ్చునా అన్న అంశంపై అభిప్రాయం కోరింది. 1993లో పివి ప్రభుత్వ హయాంలో రాష్ట్రపతి అయోధ్య సమస్యపై అభిప్రాయం కోరగా మా పరిధిలోకి రాదని కోర్టు నిరాకరించింది. 2011లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం వుండగా 2జి స్పెక్ట్రం కేటాయింపులపై కూడా సుప్రీం తీర్పు తర్వాత వేలం ద్వారానే స్పెక్ట్రంను విక్రయించాలా మరే మార్గం అనుసరించరాదా చెప్పాలని రాష్ట్రపతి అభిప్రాయం కోరారు. విచారణ తర్వాత సుప్రీం ధర్మాసనం అదొక్కటే పద్ధతి అని చెప్పలేమని బదులిచ్చింది. ఏమైనా రాజ్యాంగంలోని 142వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు మాత్రమే అందులోని అధికరణాలు, నిబంధనలకు చెల్లుబాటుపై తుది మాట చెప్పవలసి ఉంటుంది. కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక స్వభావం తీర్పు తర్వాత ఇది మరింత బలపడింది. కాకపోతే ప్రస్తుతం ద్రౌపదీ ముర్మ పంపిన ప్రస్తావన కేవలం రాజ్యాంగ నిబంధనల అనువర్తింపుకే కాక రాజకీయ సంఘర్షణకు కూడా దారి తీసేలా వుందని పరిశీలకులు సందేహించారు. రాజ్యాంగ పరమైన అనిశ్చిత పరిస్థితికి కారణమవుతున్న ఒక సుదీర్ఘ సమస్యపై న్యాయస్థానం స్పష్టమైన నిర్దేశం చేస్తే దాని అమలుకు చర్యలు తీసుకోవడానికి బదులు సాగదీత సంఘర్షణ ఎందుకని ప్రశ్నించారు.

**ఆపేస్తే చచ్చిపోతుందా?**

మే నెలలో రాష్ట్రపతి లేఖ తర్వాత సుప్రీం కోర్టు అభిప్రాయం చెప్పడం రాజ్యాంగ బాధ్యత. సిజెఐ గవారు, కాబోయే సిజె సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పిఎస్ నరసింహన్, అతుల్ ఎస్ చందూర్‌లతో కూడిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఈ నెలలో వరుసగా పదిరోజుల పాటు విచారణ జరిపింది. ఈ క్రమంలో కేంద్రం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ మెహతా, అటార్నీ జనరల్ వెంకట రమణి బిల్లులు గవర్నర్లు ఆమోదించకపోతే అది చచ్చిపోయినట్టే భావించాలని వ్యాఖ్యానించారు. సభలో చర్చించి పంపిన బిల్లును పదవిని బట్టి ఒక వ్యక్తి ఆలస్యం చేసి పక్కన పడేస్తే ఎలా చచ్చిపోతుందని న్యాయమూర్తులు ప్రశ్నించారు. రాజ్యాంగపరంగా నియమితులైన వారికి కోర్టు ఎలా గడువు విధిస్తుందని పదే పదే అడ్డు సవాళ్లు విసిరారు. తామ గడువు విధించడం లేదనీ, ఒక కాలక్రమణిక మాత్రమే సూచించామని న్యాయమూర్తులు దీటుగా జవాబు చెప్పారు. నిర్దిష్టంగా ప్రతి బిల్లు ఇన్ని రోజుల్లోనే పూర్తి చేయాలని కాదు. అయితే గవర్నర్లు ఏ మాట చెప్పకుండా ఎంత కాలమైనా అట్టిపెట్టుకోవడం మాత్రం ఎలా చెల్లుతుంది? ప్రభుత్వాలు నిర్ణయించి చట్టసభలు చర్చించి ఒక బిల్లు ఆమోదిస్తే ఏ కారణం చెప్పకుండా ఎలాంటి గడువు లేకుండా ఆలా పక్కన పడేసి అది చచ్చిపోయిందనుకోమంటే ఎలా చెల్లుతుంది? పనులు జరగాలంటే ఏదో ఒక వ్యవధి, గడువు అంటూ వుండాలి కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు గవర్నర్లు సుహృద్భావంతో కలసి మెలసి వ్యవహరిస్తారనుకున్నారు గనకే రాజ్యాంగ నిర్మాతలు గడువు పెట్టలేదనీ, కానీ రాష్ట్రాలు సమస్య తీసుకువచ్చాక రాజ్యాంగ స్ఫూర్తితో ఒక నిర్ణయం తీసుకోవాలి కదా అని వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో నేటి ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




## కారణం ఇదే..

హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు పూర్తయినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు సానుకూలంగా జరిగినట్లు వెల్లడించారు. చర్చల్లో భాగంగా విద్యాసంస్థల యాజమాన్యాలను సమ్మె విరమించాలని కోరినట్లు భట్టి పేర్కొన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాల సమస్యలపై ఇవాళ నిర్ణయం తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయకపోతే ఈనెల 15 నుంచి కళాశాలలను నిరవధికంగా బంద్ చేయనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని కలిసిన సమాఖ్య సభ్యులు.. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే.. ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలతో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణా రావు చర్చలు జరిపారు. చర్చలకు సంబంధించిన కీలక విషయాలను భట్టి విక్రమార్కను వెల్లడించారు.

# వెనిజులా ఓడను అడ్డుకున్న అమెరికా

## పెరుగుతున్న ఉద్రిక్తతలు




**కారకాస్ - ప్రజా స్వేచ్ఛ**

అమెరికా, వెనిజులా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. వెనిజులాకు చెందిన ప్రత్యేక ఆర్థిక మండలిలో చేపల వేట కు వెళ్లిన ఓ నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడం ఉద్రిక్తతలకు కారణమైంది. అమెరికా చర్యను వెనిజులా తీవ్రంగా ఖండిం చింది. వెనిజులా ఆర్థిక వ్యవహారాల మంత్రి త్వ శాఖ శనివారం ఒక ప్రకటన చేస్తూ తొమ్మి ది మంది మత్స్యకారులతో ప్రయాణిస్తున్న ఓడను అమెరికాకు చెందిన యూఎస్‌ఎస్ జాసన్ దన్‌హమ్ (డీడీజీ–109) డిస్ట్రాయర్ అడ్డుకున్నదని ఆరోపించింది. ఓడలోని మత్స్యకారుల వల్ల ఎవరికీ ఎ లాంటి ప్రమాదం లేదని, వారంతా వినయపూర్వకంగా వ్యవహరించే వారేనని తెలిపింది. అమెరికా యుద్ధ నౌకలో 18 మంది సాయుధ ఏజెంట్లు ఉన్నారని, వారంతా తమ ఓడలోకి ఎక్కి దానిని స్వాధీనం చేసుకున్నారని చెప్పింది. ఎనిమిది గంటల పాటు తమ ఓడ అమెరికా అధీనంలో ఉన్నదని పేర్కొంది. మితిమీరిన సైనిక చర్యలకు పాల్పడడం ద్వారా అమెరికా నేరుగా తమను రెచ్చగొడుతోందని మండిపడింది. అమెరికా సైన్యం గత వారం కరేబియన్‌లో సైనిక దాడి జరిపింది. ఈ దాడిలో 11 మంది వెనిజులా వాసులు మరణించారు. మాదక ద్రవ్యాలు రవాణా చేస్తోందన్న ఆరోపణతో వెనిజులా పడవను నీటిలో ముంచేశారు. అయితే మాదక ద్రవ్యాల రవాణాపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఆరోపణలను వెనిజులా తోసిపుచ్చింది. అమెరికా అధ్యక్ష భవనం మాత్రం ఈ దాడిని సమర్థించుకుంది. ఇదిలావుండగా ఘర్షణలకు అవకాశమున్న 284 ప్రదేశాలలో రక్షణ దళాలను, పోలీసులను, పౌర మిలిషియాలను మోహరిస్తున్నట్లు వెనిజులా అధ్యక్షుడు మదురో ప్రకటించారు. జలాల పరిరక్షణకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైతే సాయుధ పోరాటానికీ సిద్ధమేనని ఆయన తెలిపారు.

# ఈ నెల 21న సూర్యగ్రహణం..

## ఈ గ్రహణం భారత్‌లో కనిపిస్తుందా..?




**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

త్వరలో ఖగోళ ప్రియులను సూర్యగ్రహణం కనువిందు చేయనున్నది. ఇటీవల సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఏర్పడనున్న ఆఖరి గ్రహణం ఇదేకానున్నది. ఈ నెల 21న పాక్షిక సూర్యగ్రహణం ఏర్పడనున్నది. దక్షిణార్ధగోళంలోని పలు ప్రాంతాల్లో మాత్రమే కనిపించనున్నది. యూనివర్సల్ టైమ్ ప్రకారం రాత్రి 7.43 గంటలకు వరకు గ్రహణం గరిష్ఠ స్థాయికి చేరుతుంది. ఈ గ్రహణం న్యూజిలాండ్, తూర్పు ఆస్ట్రేలియా, దక్షిణ పసిఫిక్ దీవులు, అంటార్కిటికా వంటి ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించనుంది. న్యూజిలాండ్‌లోని డ్యూనెడిన్ నగరంలో అయితే సూర్యుడు దాదాపు 72శాతం వరకు చంద్రుని ఛాయలోకి వెళ్లే అవకాశముందని ఖగోళ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశం, పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో ఈ గ్రహణం కనిపించదని ఖగోళ శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే, నాసా ఈ గ్రహాన్ని ప్రసారం చేయనున్నది. ఈ సూర్య గ్రహానికి ప్రత్యేక ఉన్నది. సెప్టెంబర్ 22న జరుగనున్న ఈక్వినాక్స్‌కు ముందే సంభవిస్తుండగా.. దీన్ని ఈక్వినాక్స్ ఎక్లిప్స్‌గా పేర్కొంటున్నారు. ఈక్వినాక్స్ సమయంలో భూమిపై పగలు, రాత్రి సమయాలు సుమారుగా సమానంగా ఉంటాయి. ఇది ఉత్తరార్ధగోళంలో శరదృతువు ప్రారంభాన్ని, దక్షిణార్ధగోళంలో వసంతాకాల ఆరంభాన్ని ఇది సూచిస్తుంది. ఈ గ్రహణాన్ని ప్రత్యక్షంగా కంటితో చూడకూడదని.. దాంతో కళ్ళకు హానికరమని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా సోలార్ గ్లాసెస్ వంటి వాటిని ఉపయోగించి చూడొచ్చని చెబుతున్నారు. ఈ గ్రహాన్ని నాసా, రష్యాకు చెందిన ఈసా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాయి.

# యునెస్కో తాత్కాలిక వారసత్వ జాబితాలో తిరుమల కొండలు

## భారత్ నుంచి ఏడు ప్రదేశాలకు చోటు



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

యునెస్కో తాత్కాలిక ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో మన దేశం నుంచి ఏడు ప్రదేశాలకు చోటు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల కొండలు, ఎర్ర మట్టి దిబ్బలు (విశాఖపట్నం), కర్ణాటక ఉడుపిలోని సెయింట్ మేరీ ఐస్ ల్యాండ్ క్లస్టర్, మేఘాలయాలోని తూర్పు ఖాసి కొండల్లోని పురాతన గుహలు, నాగాలాండ్‌లోని ఓఫియోలైట్(సముద్రం అడుగులోని శిలల క్రమం), మహారాష్ట్ర పంచగని, మహాబలేశ్వర్‌లోని దక్కన్ ట్రాప్స్(లావా నిక్షేపాలతో ఏర్పడిన ప్రాంతం), కేరళ తీరంలోని సహజమైన వర్కల(ఎర్ర లాటరైట్ కొండలు) ఈ జాబితాలో ఉన్నాయి. వీటిని యునెస్కో ప్రపంచ వారసత్వ ఆస్తుల జాబితాలో చేర్చినట్టు అధికారులు తెలిపారు. ఈ ఆస్తులను(ప్రదేశాలను) జాబితాలో చేర్చడం వల్ల వాటి పరిరక్షణ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 12న ఆ ఏడు ఆస్తులను యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చేర్చినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. వీటితో తాత్కాలిక జాబితాలో ఉన్న భారతీయ ఆస్తుల సంఖ్య 69 చేరిందని వెల్లడించారు. ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చేముందు తాత్కాలిక జాబితాలో చేర్చడ ం తప్పనిసరి పేర్కొన్నారు. దీనికి సహకరించినందుకు భారత పురావస్తు సర్వే సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# దేశాభివృద్ధిలో ఇంజినీర్లది కీలకపాత్ర



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ**

తమ మేధోశక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజినీర్లదేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజినీర్లందరికీ ముఖ్యమంత్రి ఇంజినీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థికా భివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నారని సీఎం గుర్తుచేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరుగా, దార్శనికుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారని తెలిపారు. అత్యుత్తమ సాంకేతికతతో వివిధ రంగాల్లో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయని సీఎం చెప్పారు. మూసీ వరదల నుంచి హైదరాబాద్ నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు, ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఇంజనీరింగ్ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు అందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్స్ తమవంతు పాత్ర పోషించాలని సీఎం పిలుపునిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వం తీసుకున్న లేబర్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి.

## బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక శాఖ సంఘం అధ్యక్షులు చల్ల నరసింహ

**మల్కాజ్గిరి/మేడిపల్లి: -- ప్రజా స్వేచ్ఛ**


బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణ కార్మిక శాఖ సంఘం అధ్యక్షులు చల్ల నరసింహ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక శాఖ సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి 4వ జిల్లా సమావేశాలు కమలానగర్ ఈసీఐఎల్ ఏర్పాటు చేయడం జరిగినది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భవన నిర్మాణ కార్మిక శాఖ ప్రధాన కార్యదర్శి కొట్టం రాజు, ఐ సి టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగినది. అనంతరం కొట్టం రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 4లేబర్ చట్టాల ద్వారా అనేక సమస్యలు



ఎదురవుతున్నాయి ఈ సమస్యను ప్రతి ఒక్కరు ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉంది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినటువంటి కార్మిక సంఘాలను మళ్లీ పునరుద్ధరించాలని అలాగే కార్మికుల ఔన్నత్యానికి పాటుపడే విధంగా కొత్త చట్టాలు రూపొందించాలని అన్నారు. అనంతరం సల్ల నరసింహ మాట్లాడుతూ భావననిర్మాణ కార్మికశాఖ సభ్యులు అందరు కూడా లేబర్ కార్డు తీసుకోవాలి అలాగే భవన నిర్మాణ కార్మిక శాఖలో పనిచేసేటువంటి కార్మికులందరికీ లేబర్ కార్డు తీసుకునే విధంగా ప్రోత్సహించాలి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టేటువంటి పథకాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని అలాగే మన కార్మిక సంఘాల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో వేణు ఏ యాదగిరి మీనయ్య ప్రవీణ్ కుమార్ చంద్రయ్య ప్రశాంత్ హరీష్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నిరుపేదలకు ఆసరా..

## నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి.



**మహేశ్వరం,- ప్రజా స్వేచ్ఛ**

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నిరుపేదలకు వరమని నియోజకవర్గము కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నేదునూరు గ్రామానికి చెందిన వారికి సీఎం రిలీఫ్ అండ్ చెక్కులను అయన అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్, వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు అఫ్జల్ బేగ్, డైరెక్టర్ సాదా పాండురంగారెడ్డి, నాయకులు అమరేందర్ రెడ్డి, రాకేష్ గౌడ్, అంకగళ్ల దర్శన్, రాములు గౌడ్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు నిలయంగా కరీంనగర్



**కరీంనగర్, - ప్రజా స్వేచ్ఛ**

సౌత్ ఇండియా కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు నేడు కరీంనగర్ పట్టణంలోని రేకుర్తిలోని సాయి లక్ష్మి ఫంక్షన్ హాల్లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కరీంనగర్ అన్ని క్రీడలకు నిలయంగా మారుతోంది. పిల్లలు మొబైల్‌కి దూరంగా ఉండి క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది. చదువుల్లోనూ రాణించగలుగుతారు" అని తెలిపారు.టోర్నమెంట్ నిర్వాహకులు ఆర్. ప్రసన్న కృష్ణను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు.ఈ పోటీల్లో 500 మంది క్రీడాకారులు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్కెఐ ఇండియా చీఫ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మంతెన కిరణ్, సీనియర్ కరాటే మాస్టర్ వసంత్ కుమార్, గౌరు రాజిరెడ్డి, మొండయ్య, సురభి వేణుగోపాల్, మాడుగుల ప్రవీణ్, పెద్ది సందీప్, పెద్ది అనుదీప్, దేవేందర్, రాకేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు విలేకరులకు ప్రశంస పత్రాములు అందచేత.

## ఏపీ మీడియా అకాడమీ చైర్మన్. ఆలపాటి సురేష్.

**గూడూరు -- ప్రజా స్వేచ్ఛ**

ఏపీ మీడియా, ఏపీయూడబ్ల్యూజే, ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కర్నూలు మౌర్య ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్ లో జరిగిన గ్రామీణ విలేకరులకు పునరుచ్చరణ తరగతులు నిర్వహించారు పాల్గొన్న గూడూరు హంస విలేఖరి కె. అబ్దుల్లాకు . మరియు, విశాలాంధ్ర



విలేఖరి జి ఉరుకుందు, పార్టీస్ ఫైట్ ప్రశంస పత్రమును, ఏపీ మీడియా చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అందజేశారు. అనంతరం ఆయనతో ఏపీయూడబ్ల్యూజే గూడూరు కమిటీ గౌరవ అధ్యక్షులు, సీనియర్ విలేకరి అయిన ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీనివాసులు నాయుడు, సాక్షి శ్రీనివాస్,లక్ష్మన్న, గూడూరు మండల అధ్యక్షులు జి. ఉరుకుందు, స్నేహల్, హంస వాయిస్ విలేకరి కే అబ్దుల్లా. వారితో మర్యాదపూర్వకంగా కలిశారు.

# కాళేశ్వరంపై విచారణ ఆగెందుకే కేటీఆర్ రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆఫీస్ మోల్ సాబ్.



**మెదక్ జిల్లా - ప్రజా స్వేచ్ఛ**

ప్రధాని మోడీ మెప్పు కోసం కాళేశ్వరం పై విచారణ ఆగేందుకు కేటీఆర్ రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని మెదక్ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆఫీస్ మోల్ సబ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ కు రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కాదన్నారు. బిజెపి బీఆర్ఎస్ విలీనంలో భాగంగా కాళేశ్వరం విచారణ ఆగిందన్నారు.ఈ కేసును సిబిఐకి అప్పజెప్పితే 48 గంటల్లో తేలుస్తామన్న మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వని బిఆర్ఎస్ కు తెలంగాణ పదం పలికే అర్హత లేదన్నారు. భావిభారత ప్రధాని రాజ్యాంగ పరిరక్షకుడు రాహుల్ గాంధీని విమర్శిస్తే సహించబోమని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# శ్రీ రేణుకా మాత అమ్మవారిని దర్శించుకున్న సిద్దిపేట

## త్రీ టౌన్ సిఐ విద్యాసాగర్ దంపతులు



**దుబ్బాక -ప్రజా స్వేచ్ఛ**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో ఉన్న శ్రీ రేణుక మాత అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిని చూడగానే మహిమలు గల అమ్మవారిగా దర్శనమిస్తున్నారని అదేవిధంగా 75 సంవత్సరాల చరిత్ర ఉన్న అమ్మవారి సన్నిధిలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని త్రీటౌన్ సిఐ దంపతులు ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీ రేణుకా మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో త్రీటౌన్ సిఐ దంపతులను ప్రత్యేక పూజలు చేయించి, అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, క్యాషియర్ కొండ్ర యాదగిరి, తాజా మాజీ సర్పంచ్ సద్ది రాజిరెడ్డి, ఆలయ కమిటీ శాశ్వత సభ్యులు చందరి దుర్గారెడ్డి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు మల్లు గారి ప్రేమ్, కమిటీ సభ్యులు నక్కల నరసారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# అన్నారం ఫారెస్ట్ లో ఫారెస్ట్ అధికారుల తనిఖీలు

## అక్రమ కబ్జాలు కథనానికి స్పందన.



**మెదక్ జిల్లా - ప్రజా స్వేచ్ఛ**

మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం ఫారెస్ట్ లో ఆదివారం రోజు ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కుతుబుద్దీన్ సయ్యద్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పలు దిన పత్రికల్లో వచ్చిన వార్త పత్రికల ఆధారంగా హైదరాబాద్ ఫారెస్ట్ అధికారుల ఆదేశాలతో మెదక్ డిఎఫ్ఓ సూచనల మేరకు విచారణకు వచ్చినట్లు చెప్పారు.అక్రమార్కులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.పూర్తి వివరాలు సేకరించి విచారణ అనంతరం వెల్లడిస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా ప్లస్ పై రైతుల్లో ఆసక్తి




**ఎలిగేడు,- ప్రజా స్వేచ్ఛ**

ఎలిగేడు మండల పరిధిలో నానో యూరియా ప్లస్ పై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. ఆదివారం శివపల్లి, దూళికట్ట గ్రామాల్లో 340 బస్తాల చొప్పున యూరియా, 250 నానో యూరియా ప్లస్ బాటిల్స్ పంపిణీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సరఫరా జరిగిందని ఆయన పేర్కొన్నారు.నానో యూరియా ప్లస్ పై అవగాహన కల్పించడంతో రైతులు స్వచ్ఛందంగా వినియోగానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. దీని వలన సుడిదోమ, అగ్గి తెగులు వంటి సమస్యలు లేకుండా అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవోలు విక్రమ్, రవీందర్ రెడ్డి, ఏఈవోలు గణేష్, సురేష్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల ఆకలి తీర్చడమే రెడీ టూ సర్వ్ ముఖ్య ఉద్దేశ్యం

**నిలోఫర్,ఎంఎన్‌జే ఆసుపత్రుల వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ అన్నదానం**




ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్ ప్రతినిధి

స్వచ్ఛంద సంస్థ రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆదివారం లక్డీకపూల్‌లోని నిలోఫర్, ఎంఎన్‌జే ఆసుపత్రుల వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించింది.ఆసుపత్రులకు వచ్చే రోగులు,బంధువులు, పేదలకు ఉచితంగా భోజనం అందజేసిందిప్రతి ఆదివారం ఆకలితో బాధపడుతున్న వందలాది పేదల పూట భోజనానికి తోడ్పడాలనే సంకల్పంతో సంస్థ నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని సంస్థ నిర్వాహకుడు పెద్ది శంకర్ తెలిపారు.ప్రతి వారం మా సేవ కార్యక్రమాలు సమాజానికి చేరువవుతున్నాయి.ఆకలిని తీర్చడం మా ప్రధాన లక్ష్యం అని ఆయన అన్నారుఈ అన్నదానం కార్యక్రమంలో శివ చైతన్య,బి.టి.నాయుడు విజయభాస్కర్, నాగమోహన్, సతీష్ గౌడ్,చంద్రశేఖర్,డైసీ రిత్విక,చంద్ర,సైదులు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ధి : సుదీర్ రెడ్డి

**-అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలి**



ప్రజా స్వేచ్ఛ ఎల్ బి నగర్ నియోజకవర్గ ప్రతినిధి

సీఎం సహాయనిదితో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సుధీర్ రెడ్డి సూచించారు ఈ సందర్భంగా బాధిత కుమారుడు మనీష్ కి 2,00,000 రూపాయల ఎల్.ఓ.సీ.ఆందజేస్తున్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి కొత్తపేట డివిజన్ పరిధిలోని నాగేశ్వరరావు కాలనీ నందు నివాసం ఉండే భాస్కర్ రావు కడుపులో గడ్డలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు)ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం అయింది ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకుసీ.యం.సహాయ నిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకుసీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది తెలిపారు ఈ కార్యక్రమంలో భారస నాయకులు ప్రతిక్,సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గుల్బర్గా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

**కాంగ్రెస్ నేత మహమ్మద్ ఇబ్రహీం**



ప్రజా స్వేచ్ఛ షాద్ నగర్ ప్రతినిధి

షాద్ నగర్ కాంగ్రెస్ నేతలు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా లోని హాజ్రాత్ ఖజా బందే నవాజ్ దర్గాలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,మహమ్మద్ ఇబ్రహీం,కాజా ఇసాక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని వేడుకున్నట్లు షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలు రైతులు సుఖంగా జీవించాలని దర్గాలో ప్రత్యేక ప్రార్థన చేసినట్లు తెలిపారు.

# పెండింగ్ కేసుల కోసం మధ్యవర్తిత్వ కేంద్రాలు



**మెట్ పల్లి - ప్రజా స్వేచ్ఛ**

దేశవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న కేసుల్ని వేగంగా పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు ముందడుగు వేస్తూనే వుంది. ఈ క్రమంలో లోయర్ కోర్టులో పెండింగ్ కేసుల్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించే ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్బిట్రేషన్ తరహాలోనే ప్రతి కోర్టులో మీడియాషన్ సెంటర్స్ ఏర్పాటుకోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ కి సుప్రీం కోర్టు కొన్ని మార్గదర్శకాల్ని జారీ చేసింది. జాతీయ మరియు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ మార్గదర్శకాల ప్రకారం అన్నీ జిల్లా యూనిట్ల పరిధిలోని జిల్లా లీగల్ సర్వీసెస్ అథరిటీస్ ఆధ్వర్యంలో అన్ని లోయర్ కోర్టుల్లో పెండింగ్ కేసుల లిస్టింగ్ చేయడంతో పాటు వాటి పరిష్కారం కోసం ఆయా కోర్టుల్లోనే మీడియాషన్ సెంటర్లని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో మధ్యవర్తిత్వానికి ఆస్కారం ఉన్న కేసుల్ని ఇరుపార్టీల సహకారం తో సెటిల్/రాజీ చేయడానికి ఆసక్తి, అనుభవం మరియు నైపుణ్యం ఉన్న న్యాయవాదుల నుండి దరఖాస్తుల్ని స్వీకరించి ఎంపిక చేసారు. ఎన్నికైన న్యాయవాదులకు శిక్షణ అనంతరం, వారి వారి కోర్టు పరిధిలోనే మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రాజీకి సిద్ధంగా మరియు అనుకూలంగా ఉన్న లిస్టింగ్ కేసుల్ని బదిలీ చేసి వాటి పరిష్కారానికీ కృషి చేస్తారు.

**ఎల్లుండి నుండి 5 రోజుల ప్రత్యేక శిక్షణ**

జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, మెట్ పల్లి, కోరుట్ల, ధర్మపూరి లలో మొత్తం 5 జూనియర్ సివిల్ కోర్టులతో పాటు, 2 సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉండగా, వీటిలో దాదాపు 600 కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారానికి ఆస్కారం ఉన్నట్టు జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గుర్తించారు. వీటి సత్వర పరిష్కారం కోసం ప్రస్తుతం జిల్లా కోర్టులో ఒక మీడియాషన్ సెంటర్ పనిచేస్తుంది. మెట్ పల్లి మరియు కోరుట్ల కోర్టుల్లో కూడా మీడియాషన్ సెంటర్లని ఏర్పాటుకి ప్రతిపాదనలు సిద్ధం చేయగా , మెట్ పల్లి నుండి సీనియర్ న్యాయవాదులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్ మరియు పసునూరి శ్రీనివాస్ లని ఎన్నిక చేసారు. మీడియాషన్ సెంటర్ల నిర్వహణ పై వీరికి ఈ నెల 16 నుండి 20 వరకు కరీంనగర్ లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేరుతో ఉత్సవాలు నిర్వహించాలి

**కామ్రేడ్ అజీజ్ పాషా**




**- ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్ చేశారు.సిపిఐ సరూర్ నగర్ మండలసమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ నగర్ లో జరిగిన సమావేశానికి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అజీజ్ పాషా హాజరై మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరితో పాటు తెలంగాణ ప్రాంత విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మట్టి మనుషులంతా ఏకమైన దొరలు,భూస్వాములు, జాగీర్థాల గడిలు బద్దలు కొట్టి వారిని తరిమి కొట్టి మహోత్తర ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటామని, ఆలాంటి వీర తెలంగాణ పోరాట స్ఫూర్తిని నేటి తరాలకు అందించాల్సి ప్రభుత్వాలు సమైక్య దినోత్సవమంటూ,ప్రజా పాలన దినోత్సమంటూ రకరకాల పేరులతో వేడుకలు జరపడంమేమిటని ప్రశ్నించారునాటి సాయుధ పోరాటమే లేకపోతే నేడు తెలంగాణ రాష్ట్రమే ఉండేది కాదని గుర్తుంచుకోవాలన్నారు ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేరుతో ఉత్సవాలు నిర్వహించాలని సాయుధ అనే పేరు పలకేందుకు భయముంటే తెలంగాణ రైతాంగ పోరాటంపేరుతోనైనా ఉత్సవాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తే ప్రభుత్వానికి, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికే మంచి పేరు,గుర్తింపు వస్తుందని సూచించారు. అదేవిధంగా నాటి సమర యోధుల త్యాగాలతో పాటు వారి చరిత్ర భావి తరాలకు అందించేందుకు రాష్ట్ర రాజధాని కేంద్రమైన హైదరాబాద్‌లో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు ఈ పోరాటానికి న్యాయకత్వం వహించిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి,ఆరుట్ల రామచంద్రారెడ్డి,చాకలి ఐలమ్మ,కమలాదేవి,ధర్మ భిక్షం లాంటి మహానేతల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై,ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఓ చరిత్ర అని,ఈ పోరాటాన్ని బిజెపి హిందూ, ముస్లింల మధ్య ఘర్షణగా వక్రీకరించే ప్రయత్నం చేస్తోందని అగ్రహం వ్యక్తం చేశారు.నాడు అన్ని వర్గాల పేద ప్రజలను హింసిస్తున్న ధనిక వర్గాలకు వ్యతిరేకంగా జరిగిన వర్గ పోరాటమని పేర్నొన్నారు.నాడు ఈ మహోత్తర సాయుధ పోరాటం జమిందార్లు,భూస్వాములు, జాగీర్‌దార్లకు వ్యతిరేకంగా జరిగిందనివీరిలో 90 శాతానికి పైగా హిందువులే ఉన్నారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఇస్కప్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ గోపాల్.సిపిఐ.ఎస్ టి యు తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కర్ణాకర్ రెడ్డి,సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు జిల్లాల కృష్ణ మహబూబ్ కమలమ్మ రమావత్ సక్రు నాయక్.సిపిఐ నాయకులు వగ్రే ఇస్తారు సాహెద్.ఇదిబాయ్ నూర్జహాన్ నరసమ్మ బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# టి స్టాల్ ను ప్రారంభించిన ఆర్. శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్



ప్రజా స్వేచ్ఛ

**14.పెద్దమందడి/ వనపర్తి.జిల్లా**

పెద్దమందడి మండలం, వెలటూర్ న్యూ ఎస్సి కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన టీస్టాల్ ప్రారంభించడానికి, నిర్వాకులు ఆంజనేయులు ఆహ్వానం మేరకువెలటూర్ గ్రామమాజీ(ప్రస్తుత) సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి ఆదివారం రోజు ఉదయం టి హోటల్ ను ప్రారంభించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ,ఎవరో వస్తారని ఏదోచేస్తారనిఎదురు చూడకుండా,కాలయాపన చేయకుండా జీవనోపాధి గా టీస్టాల్ ఏర్పాటు చేసుకోవడం హర్షించ దగ్గవిషయమనీ'నిరుద్యోగులకు ఆధర్శంగా నిలిచిన ఆంజనేయులును అభినందిస్తున్నా అన్నారు.ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్వ.భాలచంద్రయ్య, జి.చంద్రశేఖర్ రెడ్డి (ఇందిరమ్మ కమిటీ సభ్యులు),దిండు రవీందర్ (వార్డు సభ్యులు),మల్లికార్జున్ (మాజీ ఉప సర్పంచ్),జి.అంజ నేయులు(ఇందిరమ్మ కమిటీ సభ్యులు),వడ్డే శేఖర్(ఇందిరమ్మ కమిటీ సభ్యులు),ఐ.సుదర్శన్ రావ్(అధ్యాపకులు), పి.సత్యన్న,సుద్దబాయి రాజు,డి.జయరాజు,కావలి రాజు,నాగభూషణ్ కె.కొండన్న,పి.రాములు, ఎ.రాములు,దయ్యాల శేఖర్, ఖాజా హుస్సేన్ కొత్త బాలస్వామి,బీరప్ప, కాలనివాసులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ప్రథమ చికిత్సలు

**బైంసా డివిజన్ అధ్యక్షులు మోహన్**



ప్రజా స్వేచ్ఛ బైంసా ప్రతినిధి

ప్రభుత్వ నిబంధనల మేరకే ఆర్ఎంపీపీ ఎంపీలు ప్రథమ చికిత్సలు నిర్వహించాలని బైంసా డివిజన్ ఆర్ఎంపి అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ అన్నారు, తాండూర్ మండల కేంద్రంలో నూతనంగా కార్యవర్గాన్ని ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీలకు శిక్షణ విషయమై త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు రాత్రి పగలు అనకుండా ప్రథమ చికిత్సలు నిర్వహిస్తున్న ఆర్ఎంపీలను ప్రభుత్వం విస్మరించడం తగదని తెలిపారు, ప్రభుత్వ తీరు ఇలాగే కొనసాగితే ఆర్ఎంపీలు ఉద్యమాన్ని కొనసాగిస్తారని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో బైంసా మండల ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు కదం అర్జున్ పార్టీల్, ముధోల్ మండల అధ్యక్షులు దుర్గాప్రసాద్, డివిజన్ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, తాండూర్ మండలం మాజీ అధ్యక్షులు ప్రవీణ్, పాటు మండలానికి చెందిన పలువురు ఆర్ఎంపీలు పాల్గొన్నారు,

# చిన్నారి జన్మదిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే టి.మేగారెడ్డి



**ప్రజా స్వేచ్ఛ వనపర్తి. జిల్లా ప్రతినిధి.**

వనపర్తి జిల్లా, రేవల్లి మండలం గౌరీదేవి పల్లి గ్రామానికి చెందిన, శివారెడ్డి,లక్ష్మి కీర్తిల కూతురు పుట్టినరోజు వేడుకలను, ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎ ఆర్.బంకెట్ హాల్లో నిర్వహించారు.ఈ పుట్టినరోజు కార్యక్రమానికి వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై చిన్నారి హన్వికను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా చిన్నారి హన్విక తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులతో పాటు ఆయన ఫోటోలు దిగి కాసేపు సందడి చేశారు.పిల్లల జీవితాల్లో ఇలాంటి వేడుకలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని హన్విక పుట్టినరోజు నిర్వహించిన వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో, కుటుంబ సభ్యులతో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణరెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఇంత తగ్గుతుందని మీరెప్పుడైనా ఆలోచించారా?

### ఈ బైక్‌పై ఏకంగా రూ.91 వేలు తగ్గింపు



మీరు కొన్ని రోజుల్లో బైక్ కొనాలని ఆలోచిస్తుంటే ఈ వార్త మీకు ప్రయోజనకరంగా ఉంటుంది. భారతదేశపు మోటార్‌సైకిల్ తయారీదారు మోటో మోరిని తన సీమ్మెజ్జో 650 మోడళ్ల ధరలను భారీగా తగ్గించింది. కంపెనీ బైక్ ధరలను తగ్గించిన తర్వాత ఈ బైక్‌లు మునుపటి కంటే చౌకగా మారాయి. ఇప్పుడు బైక్ ధరపై ఎంత తగ్గింపు ఇస్తున్నారో వివరంగా తెలుసుకుందాం.ధరల్లో భారీ తగ్గుదల: ఈ సంవత్సరం మోటో మోరిని సీయెమ్మెజ్జో మోటార్ సైకిళ్ల ధరలను తగ్గించడం ఇదే మొదటిసారి కాదు. మొదట ఫిబ్రవరి 2025లో 650 రెట్రో స్ట్రీట్, 650 స్క్రాంబ్లర్ ధరలను రూ. 2 లక్షల వరకు తగ్గించారు. వాటి పాత ధరలు వరుసగా రూ. 6.99 లక్షలు, రూ. 7.10 లక్షలు. కానీ ఇప్పుడు కంపెనీ స్క్రాంబ్లర్ ధరలను రూ. 91,000 వరకు తగ్గించింది. కంపెనీ ధరలను మరింత తగ్గించింది.సెప్టెంబర్ 21 లోపు కొనుగోలు చేస్తే అదనపు ప్రయోజనం: భారతదేశంలో సెప్టెంబర్ 22 నుండి GST రేట్లు అమలులోకి వస్తాయి. అటువంటి పరిస్థితిలో కంపెనీ తన కస్టమర్ల కోసం అద్భుతమైన ఆఫర్‌ను తీసుకువచ్చింది. ఈ ఆఫర్ కింద సెప్టెంబర్ 21 కి ముందు బైక్ కొనుగోలు చేసే కస్టమర్‌లకు రూ. 33,000 తగ్గింపు లభిస్తుంది. లేకపోతే GST రేట్లు అమలు తర్వాత 350cc కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్‌ల ధర పెరుగుతుంది.అదే సమయంలో పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కంపెనీ రుణం, EMI ఎంపికలను కూడా ఉంచింది. వీటిలో పొడిగించిన రుణ కాలపరిమితి, 95% వరకు కవరేజ్ ఉన్నాయి.సీమ్మెజ్జో 650 ఇంజిన్: దీని రాబోయే రెండు బైక్‌లు ఒకే 649 cc సమాంతర-ట్విన్ ఇంజిన్‌ను ఉపయోగిస్తాయి. ఇది 55.7hp శక్తిని, 54Nm టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ధర తగ్గింపు ఈ బైక్‌ను రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650 (ధరలు రూ.3.10 లక్షల నుండి ప్రారంభమవుతాయి). అలాగే బేర్ 650 (ధరలు రూ.3.46 లక్షల నుండి ప్రారంభమవుతాయి) వంటి దేశీయ మోటార్‌సైకిళ్లకు దగ్గరగా తీసుకువస్తుంది.

## స్థిరంగా బంగారం ధరలు.. బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



బంగారం కొనాలనుకునే వారికి షాక్. బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో (సెప్టెంబర్ 14న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 11, 170కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 01, 900కి చేరింది .ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 11, 300కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 02, 050కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 11, 170కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 01, 900కి చేరింది . వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే స్థిరంగా ఉన్నాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం (

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900

విజయవాడలో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900

ఢిల్లీలో రూ. 1, 11, 300, రూ. 1, 02, 050

ముంబైలో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900

వడోదరలో రూ. 1, 11, 200, రూ. 1, 01, 950

కోల్‌కతాలో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900


చెన్నైలో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900

బెంగళూరులో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900

కేరళలో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900

పుణెలో రూ. 1, 11, 170, రూ. 1, 01, 900

## వేల కోట్ల నష్టాల్లో ఫ్లిప్‌కార్ట్..! కారణాలు ఇవే..




వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మార్చి 2025 (FY25) తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.5,189 కోట్ల విస్తృత ఏకీకృత నష్టాన్ని చవిచూసింది. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ పంచుకున్న డేటా ప్రకారం.. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో (FY24) రూ.4,248.3 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఫ్లిప్‌కార్ట్ కార్యకలాపాల ద్వారా ఏకీకృత ఆదాయం 17.3 శాతం పెరిగి 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 82,787.3 కోట్లకు చేరుకుంది, ఇది 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.70,541.9 కోట్లుగా ఉంది. అయితే కంపెనీ ఖర్చులు కూడా దాదాపు అదే వేగంతో పెరిగాయి. ఈ సంవత్సరంలో మొత్తం ఖర్చులు 17.4 శాతం పెరిగి రూ.88,121.4 కోట్లకు చేరుకున్నాయి. స్టాక్-ఇన్-ట్రేడ్ కొనుగోలు అతిపెద్ద వ్యయ డ్రైవర్, ఇది FY25లో రూ.87,737.8 కోట్లకు పెరిగింది, ఇది అంతకు ముందు సంవత్సరం రూ.74,271.2 కోట్లుగా ఉంది. దాని ఆర్థిక వివరాల ప్రకారం.. ఆర్థిక ఖర్చులు కూడా దాదాపు 57 శాతం పెరిగి రూ.454 కోట్లకు చేరుకున్నాయి. ఈ-కామర్స్ మార్కెట్ ప్లేస్‌ను నిర్వహిస్తున్న ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ సంవత్సరంలో తన నష్టాలను తగ్గించుకోగలిగింది.2025 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.1,494.2 కోట్ల నికర నష్టాన్ని నివేదించింది. ఇది 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.2,358.7 కోట్ల నష్టం కంటే తక్కువ. స్వతంత్ర ప్రాతిపదికన దాని నష్టాలు రూ.1,568.6 కోట్లుగా ఉన్నాయి, ఇది గత సంవత్సరం రూ.2,296.2 కోట్లుగా ఉంది. ఆర్థిక డేటా ప్రకారం.. ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ ఆర్థిక సంవత్సరం 2025లో రూ.20,746 కోట్ల ఆదాయాన్ని నివేదించింది, ఇది 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.18,187.7 కోట్ల నుండి 14 శాతం పెరుగుదలను నమోదు చేసింది. మొత్తం ఖర్చులు రూ.22,315 కోట్లుగా నివేదించింది. ఏకీకృత ప్రాతిపదికన, కంపెనీ ఆదాయాలు FY25లో రూ.20,807.4 కోట్లకు పెరిగాయి. ఇది గత సంవత్సరం రూ.18,241.6 కోట్లుగా ఉంది.

## సూర్య, అభిషేక్ విధ్వంసం.. దాయాదిని చిత్తుగా ఓడించిన టీమిండియా




వరల్డ్ కప్‌లోనే కాదు ఆసియా కప్‌లోనూ తమకు తిరుగులేదని చాటుతూ పాకిస్థాన్‌ను చిత్తు చేసింది భారత జట్టు. ఆదివారం చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించిన టీమిండియా ఈ మెగా టోర్నీలో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. దుబాయ్ స్టేడియంలో కుల్దీప్ యాదవ్ విజృంభణలో 127కే పాక్ పరిమితం అవ్వగా.. ఛేదనలో అభిషేక్ శర్మ (31) బౌండరీల మోతతో మెరుపు ఆరంభం ఇచ్చాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(47 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మూడో వికెట్‌కు తిలక్ వర్మ(31)తో కలిసి 56 రన్స్ జోడించిన సూర్య జట్టు విజయానికి బాటలు వేశాడు. ఫినిషర్ శివం దూబే(10 నాటౌట్) తనదైన స్టయిల్లో ఆడగా.. సిక్సర్‌తో భారత్‌కు 7 వికెట్ల విజయాన్ని అందించాడు సూర్య.ఆసియా కప్‌లో బాయ్‌కాట్ నిరసనల మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్ విజయఢంకా మోగించింది. చిరకాల ప్రత్యర్థి పాక్‌ను వణికిస్తూ భారీ విక్టరీతో ఈజీ కాదని మరోసారి చాటింది. తొలుత పాక్‌ను 127కే నిలువరించిన నిర్దేశించిన టీమిండియా స్వల్ప లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే అందుకుంది. దాయాది నిర్దేశించిన ఛేదనను భారత్ ధాటిగా మొదలెట్టింది. షాహీన్ అఫ్రిది వేసిన తొలి ఓవర్లో మొదటి రెండు బంతులకు అభిషేక్ శర్మ 4, 6 బాదాడు. రెండో ఓవర్లో సయీం అయూబ్‌ను ఉతికేస్తే శుభ్‌మన్ గిల్(10) రెండు ఫోర్లు కొట్టాడు.అయితే.. ఆఖరి బంతికి షాట్ ఆడబోయిన గిల్ స్టంపౌట్ అయ్యాడు. వికెట్ పడినా సరే అభిషేక్ జోరు తగ్గించలేదు. సయీంను లక్ష్యంగా చేసుకొని రెండు బౌండరీలు సాధించిన అతడు అతడి ఓవర్లోనే వెనుదిరిగాడు. అభిషేక్ ఔటయ్యాక వచ్చిన తిలక్ వర్మ(31) సైతం ఫోర్లతో చెలరేగాడు. నవాజ్ వేసిన ఆరో ఓవర్లో రెండు ఫోర్లతో జట్టు స్కోర్ 60 దాటించాడు. దాంతో.. పవర్ ప్లేలో భారత్ రెండు వికెట్ల నష్టానికి 61 స్కోర్ చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(47 నాటౌట్), తిలక్ . మూడో వికెట్‌కు విలువైన 56 రన్స్ జోడించి జట్టును విజయ తీరాలకు చేర్చారు.

అయితే.. అయుబ్ ఓవర్లో తిలక్ బౌల్డ్ కాగా.. అప్పటికి విజయానికి 45 బంతుల్లో 31 రన్స్ కావాలి. అనంతరం శివం దూబే(10 నాటౌట్) అండగా సూర్య చెలరేగిపోయాడు. సయీం వేసిన 15వ ఓవర్లో చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపాడు. సూఫియన్ బౌలింగ్‌లో ఎల్బీ అప్పీల్ అనంతరం సారథి సూర్య సిక్సర్ బాదగా 7 వికెట్ల తేడాతో పాక్‌ను మట్టికరిపించింది భారత్. ఈ విక్టరీతో సూర్యకుమార్ యాదవ్ బృందం సూపర్ 4కు చేరువైంది.

**ఫర్హాన్, అఫ్రిది రాణించగా..**

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న పాకిస్థాన్ భారత బౌలర్ల విజృంభణతో స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా వికెట్ల వేటతో పాక్‌ను మానసికంగా దెబ్బతీశారు. యూఏఈపై చెలరేగిన కుల్దీప్ యాదవ్(3-18) మరోసారి తన స్పిన్ మ్యాజిక్‌తో మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బకొట్టగా.. అక్షర్ పటేల్(2-18) ఓ చేయి వేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(41) ఒంటరి పోరాటం చేశాడు. ఆఖర్లో షాహిన్ అఫ్రిది(33 నాటౌట్) నాలుగు సిక్సర్లతో రెచ్చిపోయాడు. దాంతో పాక్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 రన్స్ చేసింది.

## హై జంప్ ఫైనల్లో సర్వేశ్.. తొలి భారతీయుడిగా రికార్డు



ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత హై జంపర్ సర్వేశ్ కుశారే చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ పోటీల్లో సత్తా చాటుతూ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. టోక్యో ఒలింపిక్స్ విజేత గియన్‌మార్కో తంబేరి ని వెనక్కి నెట్టిసి పతకానికి మరింత చేరువయ్యాడు. తద్వారా భారత్ నుంచి ఈ విభాగంలో ఫైనల్ చేరిన తొలి పురుష అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు సర్వేశ్.జపాన్ రాజధాని టోక్యో వేదికగా జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో సర్వేశ్ కుశారే కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో తన బలాన్నంతా కూడదీసుకొని జంప్ చేశాడు. ఫైనల్ అర్హతకు నిర్దేశించిన 2.16 మీటర్ల ఎత్తు దూకడంలో తొలి ప్రయత్నంలో విఫలం అయినప్పటికీ.. ఒత్తిడికి లోనవ్వలేదు సర్వేశ్. రెండో ప్రయత్నంలో 2.2 5 మీటర్ల ఎత్తు దుమికి ఫైనల్ బెర్తు సాధించాడు. సర్వేశ్‌తో కలిపి 13 మంది ఫైనల్ బెర్తు సొంతం చేసుకున్నారు. పతక వేటలో భారత స్టార్ మెరుగైన ప్రదర్శన చేయాలని యావత్ భారతం కోరుకుంటోంది.

# స్పోర్ట్స్

## ఆంధ్ర బ్యాటింగ్ కోచ్‌గా ముంబై దిగ్గజం..

### రంజీ కల సాకారం అయ్యేనా..!



దేశవాళీ క్రికెట్‌లో రంజీ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న ఆంధ్ర క్రికెట్ సంఘం కీలక నియామకాలతో కోచింగ్ బృందాన్ని పటిష్టం చేసుకుంది. ప్రధాన కోచ్‌గా న్యూజిలాండ్‌కు చెందిన గ్యారీ స్టీడ్ ను ఎంచుకున్న ఏసీఏ.. బ్యాటింగ్ కోచ్‌ను ఖరారు చేసింది. ఆదివారం ముంబై దిగ్గజం వినీత్ ఇదుక్కర్ ను బ్యాటింగ్ కోచ్‌గానియమిస్తూ ప్రకటన విడుదల చేసింది. ఈ మాజీ ఆటగాడు ఇప్పటికే ఆంధ్ర స్క్వాడ్‌తో కలిశాడు. ప్రస్తుతం కర్నాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మైసూర్‌లో జరుగుతున్న టోర్నమెంట్‌తో అతడి కోచింగ్ జర్నీ ప్రారంభం కానుంది.దేశవాళీ క్రికెట్‌లో ముంబై ఆధిపత్యం చెలాయించడంలో ఇదుక్కర్ పాత్ర ఎనలేనిది. సహాయక సిబ్బందిగా ఆయన అందించిన సేవలు అపూర్వం. నిరుడు ఆయన బ్యాటింగ్ సూచనలతో ముంబై జట్టు రంజీ సెమీఫైనల్ చేరింది. అనంతరం జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలుపొందింది. అందుకే.. అనుభవజ్ఞుడైన అతడి సేవలు ఆంధ్ర జట్టుకు ఉపయోగపడుతాయని నమ్ముతున్నాం' అని ఏసీఏ వెల్లడించింది.

**ఫస్ట్ క్లాస్ కెరీర్లో 43 మ్యాచ్‌లు**

ఆంధ్ర జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా ఎంపికఫస్ట్ క్లాస్ కెరీర్లో 43 మ్యాచ్‌లువ్వడం పట్ల ఇదుక్కర్ సంతోషం వ్యక్తం చేశాడు. ఏసీఏతో చర్చలు, ఒప్పందం పూర్తయ్యాక మీడియాతో మాట్లాడుతానని చెప్పిన ఇదుక్కర్.. మైసూర్ బయల్దేరుతున్నాను అని క్రిక్‌బజ్‌తో తెలిపాడు. రంజీ ఛాంపియన్ ముంబైకి ఇదుక్కర్ కొన్నాళ్లుగా కోచింగ్ ఇస్తున్నాడు. అయితే.. 2025-26 సీజన్ ముందు అతడితో కాంట్రాక్ట్ రద్దు చేసుకుంది ముంబై క్రికెట్ సంఘం. దాంతో.. ఇదుక్కర్ సేవల్ని వినియోగించుకోవాలని ఆంధ్ర క్రికెట్ సంఘం రంగంలోకి దిగింది. ఈ మాజీ క్రికెటర్ 16 ఏళ్ల ఫస్ట్ క్లాస్ కెరీర్లో 43 మ్యాచ్‌లు ఆడాడు.

# రెజీనా షాకింగ్ కామెంట్స్




**నాకు హీరోయిన్‌గా ఛాన్స్ ఇవ్వమని అడిగితే..ఆమెను సెలక్ట్ చేశారు..**

రెజీనా కాసాండ్రా.. ఈ అందాల భామ ఒకానొక సమయంలో టాప్ హీరోయిన్ గా రాణించింది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగు, తమిళం,కన్నడ సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయస్సులోనే సినిమా రంగంలోకి అడుగుపెట్టిన రెజీనా, 2005లో తమిళ చిత్రం "కండా నాల్ ముదల్"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది. తెలుగులో "శివ మనసులో శృతి" (2012) ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు "సైమా ఉత్తమ తొలి చిత్ర నటి" అవార్డు కూడా వచ్చింది.రెజీనా తెలుగులో "రొటీన్ లవ్ స్టోరీ", "పిల్లా నువ్వు లేని జీవితం", "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్", "పవర్" వంటి సినిమాల్లో నటించి క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తమిళంలో "కేడి బిల్లా కిల్లాడి రంగా", "మానగరం" వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రశంసలు పొందింది.ఈ బ్యూటీ విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటుంది. "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్"లో సాంప్రదాయ అమ్మాయి, "జ్యో అచ్యుతానంద"లో స్టూడెంట్, "అ"లో డ్రగ్ అడిక్ట్ వంటి పాత్రల్లో తన సత్తా చాటింది.ఈ భామ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. 2019లో "ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా విడుదలైన సన్నీ డియోల్ "జాట్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. అలాగే, వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ తన సత్తా చాటుతుంది. తాజాగా రెజీనా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో వచ్చిన "అ" సినిమా స్క్రిప్ట్ చెప్పారు. నాకు హీరోయిన్‌గా ఛాన్స్ ఇస్తే చేస్తా.. లేదా ఏదైనా కీలకమైన , నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్ర ఇస్తే చేస్తా అని చెప్పిందట.. అయితే హీరోయిన్ గా ఇప్పటికే కాజల్ ను ఫిక్స్ చేశాం అని చెప్పారు. సరే మరో బలమైన పాత్ర ఇవ్వమని అడిగాను. లేదంటే సినిమా చేయను అని తెగేసి చెప్పా అని తేలింది. దాంతో మీరా అనే పాత్ర ఇచ్చినట్టు తెలిపింది రెజీనా. అలాగే రీసెంట్ గా వచ్చిన జాట్ సినిమాలోనూ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేయమన్నారు. నాకు భారతి రోల్ ఇస్తేనే చేస్తానన్నాను అని చెప్పా దాంతో నాకు ఆ పాత్ర ఇచ్చారు అని తెలిపింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

# మిరాయ్' బాక్సాఫీస్ సునామీ

## రెండు రోజుల్లోనే 55.60 కోట్లు




తేజ సజ్జ నటించిన 'మిరాయ్' సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాస్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 55.60 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించింది. 'హనుమాన్' సినిమాతో పాన్-ఇండియా స్టార్‌గా మారిన తేజ సజ్జ 'మిరాయ్'తో మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకున్నారు. సెప్టెంబర్ 12న విడుదలైన 'మిరాయ్' తొలి రోజు నుంచే అద్భుతమైన వసూళ్లను రాబడుతుంది. సినిమా మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 27.20 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించిన ఈ చిత్రం రెండో రోజు రూ. 28.40 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లోనే ఈ చిత్రం రూ.50 కోట్ల మార్క్‌ను దాటడం విశేషం. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై సుమారు రూ. 60 కోట్ల బడ్జెట్‌తో నిర్మించారు. 'మిరాయ్' సినిమాకు విజువల్స్, కథ, మరియు నటీనటుల నటనకు మంచి స్పందన రావడంతో, వారాంతంలో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది.




## 'కూలీ' నుంచి నాగార్జున ఐయామ్ ది డేంజర్ ఫుల్ వీడియో సాంగ్ రిలీజ్

రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం కూలీ. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున విలన్ పాత్ర పోషించారు. అయితే ఇందులో నాగార్జునపై చిత్రీకరించిన 'ఐ యామ్ ద డేంజర్' అనే పాట పూర్తి వీడియోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. అనిరుధ్ రవిచందర్ ఈ పాటకు సంగీతం అందించారు. ఈ పాటలో నాగార్జున స్టైల్, స్వాగ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.


## చీరకట్టుతో అందానికే అసూయా పుట్టేలా చేస్తున్న ఐశ్వర్య రాజేష్

ఐశ్వర్య రాజేష్.. ఇప్పుడు ఈ చిన్నదని పేరు టాలీవుడ్ లో ఎక్కువగా వినిపిస్తుంది. ఒకే ఒక్క సినిమాతో స్టార్ డమ్ సొంతం చేసుకుంది. రీసెంట్ గా సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది ఈ ముద్దుగుమ్మ. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.ఈ సినిమాలో వెంకటేష్ హీరోగా నటించగా.. ఆయన భార్యగా ఐశ్వర్య రాజేష్ నటించి మెప్పించింది. ఐశ్వర్య రాజేష్ తమిళ్‌లో మంచి క్రేజ్ తెచ్చుకుంది. అక్కడ వరుసగా సినిమాలు చేసి పాపులర్ అయ్యింది. ఐశ్వర్య రాజేష్ జనవరి 10, 1990లో చెన్నైలో జన్మించారు. ఆమె తండ్రి రాజేష్ 80వ దశకంలో తెలుగు చిత్రసీమలో స్టార్ హీరో. ఐశ్వర్య రాజేష్ తల్లి నాగమణి ప్రసిద్ధ నృత్యకారిణి. చిన్నతనం నుంచి చెన్నైలో పెరిగిన ఐశ్వర్య రాజేష్.. తన ప్రాథమిక విద్యను హోలీ ఏంజెల్స్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్ నుంచి పూర్తి చేసింది. ఆ తర్వాత చెన్నైలోని ఇతిరాజ్ మహిళా కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ డిగ్రీని పూర్తి చేసింది.2010లో పంచ్ భరత్ దర్శకత్వం వహించిన "నీతనా అవన్" చిత్రంలో ప్రధాన పాత్రలో నటించింది. ఈ మూవీతోనే సినీరంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టింది. 2017లో మలయాళంలో "జోమొండే సువిసెసమల్" ప్రధాన పాత్రలో నటించింది. ఆ తర్వాత వెట్రి మారన్ దర్శకత్వం వహించిన 2018 చిత్రం "వడ చెన్నై" తమిళ సినిమా భారీ హిట్ గా నిలిచింది.ఇక కౌసల్య కృష్ణమూర్తి సినిమాతో తెలుగులోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత వరుసగా మిస్ మ్యాచ్, వరల్డ్ ఫేమస్ లవర్,టక్ జగదీష్,రిపబ్లిక్ సినిమాల్లో నటించింది. సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత ఐశ్వర్య రాజేష్ చిన్న గ్యాప్ తీసుకుంది. కొత్త సినిమా పై ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు.



# రామోజీ ఫిల్మ్ సిటీలో SSMB 29..

సూపర్ స్టార్ మహేశ్ బాబు, ఎస్.ఎస్. రాజమౌళిల కాంబినేషన్‌లో వస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం SSMB 29 షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే కెన్యా అడవుల్లో యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేసుకున్న చిత్రబృందం, ఇప్పుడు హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ షెడ్యూల్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. సుమారు రూ. 50 కోట్లతో నిర్మించిన ఈ సెట్ కాశీ నగరాన్ని పోలి ఉందని, ఇందులో నదీ తీరాలు, ఘాట్‌లు, పురాతన దేవాలయాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఈ సెట్‌లో మహేశ్ బాబుతో పాటు ఇతర ప్రధాన నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ అక్టోబర్ 10 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ చిత్రానికి 'గ్లోబ్ ట్రాటర్' అనే టైటిల్‌ను జోడించినట్లు తెలుస్తోంది. మహేశ్ బాబు ఈ సినిమాలో ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడిగా కనిపించనున్నారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా 2026 చివరిలో విడుదలయ్యే అవకాశం ఉండగా.. ఈ ఏడాది నవంబర్‌లో సినిమా టీజర్ విడుదల కానుంది.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492